

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :14 సంచిక: 03 హైదరాబాద్ 2014 జులై పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# మహేవాలో ప్రేమిక మేళా

## 2014 నవంబరు 21-23 తేదీలలో

ఉత్తరప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లాలో 1952 నవంబరు 18 నుండి 27 వరకూ బాబా ప్రజాదర్శనం ఇచ్చారు. ఆ సమయంలో హమీర్‌పూర్‌కు సమీపంలోని మహేవాలో బాబా మూడ్రోజులున్నారు. బాబావారి కోసం మహేవాలో **'మెహెరస్థాన'** అనే చిన్న ఆశ్రమాన్ని కేవలం 11 రోజుల్లో స్థానిక బాబా ప్రేమికులు నిర్మించారు. ఈ ప్రాంతానికి మెహెర్‌బాబా 1954 ఫిబ్రవరి 9వ తేదీన తిరిగి రెండవసారి పర్యటించారు. 1954 ఫిబ్రవరి 9 అర్ధరాత్రి దాటాక బాబా తానే ఈ యుగావతారునిగా **అవతార్ మెహెర్‌బాబాగా స్వయంగా** ప్రకటించారు. మెహెర్‌బాబా పర్యటించిన ఈ ప్రాంతంలో ప్రతి ఏటా నవంబర్ 21, 22, 23 తేదీలలో పెద్దఎత్తున ప్రేమిక మేళా నిర్వహిస్తున్నారు. అవకాశం గల బాబా ప్రేమికులందరూ తప్పక హాజరుకావల్సిందిగా స్థానిక బాబా సెంటర్ అధ్యక్షులు శ్రీ రాజేంద్రపాల్ నిగం, మహేవా 08174073053 ఒక ప్రకటనలో కోరారు.

# పావడగ బాబా సెంటర్

ప్రతినెలా ఆఖరి ఆదివారం పావగడ మెహెర్‌బాబా సెంటర్‌లో ప్రేమిక సహవాస్ ఉ. 5 నుండి రాత్రి 8.30 దాకా నిర్వహిస్తున్నట్లు స్థానిక బాబా ప్రేమికులు శ్రీ మెహెర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ ఎ.వి.జి. హరిప్రసాద్, బెంగళూరుతోపాటు కర్నాటక రాష్ట్ర సరిహద్దుల్లో గల పలు బాబా సెంటర్ ప్రేమికులు పలువురు విశేషంగా హాజరవుతున్నారు. వీలుంటే ఇతర ప్రాంతాలవారు పావగడ సెంటర్‌ను సందర్శించ వల్సిందిగా మెహెరానంద్ (974381407) ఒక ప్రకటనలో కోరారు.

# శ్రీకాకుళం కేంద్రం 53వ వార్షికోత్సవం

అవతార్ మెహెర్‌బాబా శ్రీకాకుళం కేంద్రం 53వ వార్షికోత్సవం ఆగస్టు 24న జరుపుకుంటున్నట్లు కార్యదర్శి శ్రీ పి.వి. రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్. ఎల్. ఎ. శ్రీమతి గుండ మహాలక్ష్మి, శ్రీ బి. రామకృష్ణయ్య తదితరులు పాల్గొంటున్నారని కార్యదర్శి తెలిపారు. ఈ సందర్భంగా ఆగస్ట్ 10న డా. పి.ఎల్.ఎన్. రాజు గారి నేతృత్వంలో కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు ఉచితంగా కళ్ళజోడ్లు అర్హులైనవారికి అందజేయనున్నట్లు శ్రీ రంగ ప్రసాదరావు తెలిపారు.

**2014 ఆగస్టు పత్రికలో 1955 నవంబరు -తెలుగు సహవాస్ పరిశీలించండి!!**

# బాబా సందేశం

కోరికలు తీరినా, తీరకపోయినా అవి అనర్ధదాయకమే. కోరికలు ప్రేమను నశింపజేస్తాయి. నా ఇచ్ఛ ప్రకారం మీరు నడుచుకోవాలంటే, ముందుగా మీ కోరికలను త్యాగం చేయ్యండి.

Desires are harmful both ways when fulfilled and when not fulfilled. Desires kill Love. To fulfill MY wish you have to burn up your desires only then will you be fit to serve ME.

**- MEHER BABA**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. గుజరాతీ సహవాస్ 6-12
3. మౌన వార్షికోత్సవం 13-16
4. బెంగళూరులో బాబా సహవాస్ 17-19
5. లార్డ్ మెహెర్ 20-29
6. పెద్దన్నయ్య 30-31
7. బాలగోపాల భాస్కరరాజు- బుర్రకథ 32-35
8. అవిధేయత 36-37
9. ప్రార్ధనలు

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# సూరత్ బాబా సహవాస్

## 2014 సెప్టెంబర్ 18–19

అవతార్ మెహెర్‌బాబా గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో 1914లో ఆధ్యాత్మిక పర్యటన చేశారు. మెహెర్‌బాబా సూరత్‌ను సందర్శించి నూరు సంవత్సరాలు నిండిన సందర్భంగా 2014 సెప్టెంబర్ 18–19 తేదీలలో రెండ్రోజుల ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేశారు.

సూరత్ నగరం ముంబాయి–అహ్మదాబాద్–ఢిల్లీ రైల్వే మార్గంలో ముంబాయి నుండి 265 కి.మీ దూరంలో వుంది. సహవాస్‌లో పాల్గొనదలచినవారు వారి వివరాలు 2014 ఆగస్టు 15 కల్లా రజనీకాంత్ .ఎ. మిస్త్రీ పేరిట పంపవల్సిందిగా కోరుతున్నారు. కాగా సహవాసీల భోజన, బస ఏర్పాట్లు కోసం ఒక్కొక్కరికి రూ. 1200/– చొప్పున చెల్లించవల్సివుంటుంది. ఈ నగదు ఇండియన్ బ్యాంకు, A/C No: 5074-63656, చెల్లించగలరు. ఆడిటోరియంలో వసతి, ఇతర కారణాల వల్ల సహవాస్‌లో కేవలం 300మందికి మాత్రమే పాల్గొనేందుకు అవకాశం వుంది. కావున ముందుగా ఎవరైతే తమ పేర్లు నమోదు చేసుకుంటే వారికే సహవాస్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక హోటలులో బస ఏర్పాట్లు కావల్సినవారికి తగిన ఏర్పాట్లు చేయగలమని నిర్వహకులు తెలియజేస్తున్నారు.

మరిన్ని వివరాలకు Narendra Prasad, Hyderabad, (094406- 02754), or Rajanikanth A Mistry, B3/53, Meher Prasad, near Deva Darshan Apartments, City Light Parle Point, SURAT, Gujrat state, 09601-03886 సంప్రదించగలరు.

---

## జలనిధి

గత కొంత కాలంగా, అంటే 2013 అక్టోబరు మాసంలో శ్రీ వై.యస్. రావు బాబాలో ఐక్యమయినప్పటి నుండీ రెస్టు హౌస్‌కు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతిరోజు స్థానికంగా ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి సరఫరా చేస్తునట్లు, తద్వారా అధిక ఆర్థిక భారాన్ని భరించవల్సివచ్చిందని అన్నారు. ఈ ఆర్థిక లోటును పూరించవల్సిన ఆవశ్యకత ఎంతో వుందని చెబుతూ శ్రీ వై.యస్. రావు గారు ఏర్పాటు చేసిన **'జలనిధి'కి** తగిన విరాళాలు అందజేసి సహకరించవల్సిందిగా యాజమాన్యం కోరుతున్నారు. రెస్టు హౌసులో మీరు చెల్లించే లేదా అందజేసే విరాళాలకు స్థానిక మేనేజర్, ఆంధ్రా రెస్టు హౌస్ నుండి 'రశీదు' తప్పక పొందవల్సిందని అన్నారు.

## సంపాదకీయం • నూతన స్వచ్ఛంద సంస్థ

ఖైరమంగళలో విశ్వ ఆధ్యాత్మిక కేంద్రానికి మెహెర్‌బాబా శంఖుస్థాపన చేశారని పాఠకులకు తెలుసు. ఆనాటి కార్యక్రమంలో పాల్గొని బ్రతికున్న బహుకొద్దిమందిలో నేనొకడినని దిగంబర్ గాడేకర్ మాతో ఇటీవల మాటల్లో చమత్కరించారు. వయస్సు రీత్యా పెద్దవారైన బాబా ప్రేమికుల సంఖ్యకు కొదవేమీ లేదు. ఐతేవారిలో చాలామంది మెహెరాబాద్ దాకా రాలేక, ఇళ్ళల్లోనూ ఉండలేక సతమతమవుతున్నారని మా సమాచార భోగట్టా. అవతారుని సన్నిధిలో కొద్దిసేపైనా గడపాలని వారు అనుక్షణం తహతహలాడుతున్నారు. ఐతే, వయస్సు, ఆరోగ్యం సహకరించికపోవడంతో వారి ఆలోచనలను కట్టడి చేసుకుంటున్నారు. ఇలాంటి వారికోసమే అన్నట్లు మౌన వార్షికోత్సవం, అమరతిథి రోజుల్లో నాలుగేళ్ళ క్రితమే శ్రీ వై.యస్. రావ్ ఆంధ్రా రెస్టు హౌసు నుండి బాబా సమాధి దాకా ప్రత్యేక ఉచిత రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ విధానం నేటికీ కొనసాగుతోంది. మెహెరాబాద్‌లో బస చేసిన పలువురు వృద్ధులకు ఇలాంటి సౌకర్యం ఆవశ్యకత ఎంతో వుంది. ఈ అవసరాన్ని గుర్తించిన ఒక అమెరికన్ వనిత, బాబా ప్రేమికురాలు శ్రీమతి కారన్ ఒక స్వచ్ఛంద సంస్థను ఇటీవల మెహెరాబాద్‌లో ప్రారంభించారు. ప్రతిరోజూ సాయంత్రం ప్రార్థనలు, ఆరతి ఇచ్చే సమయానికి ఆయా బాబా ప్రేమికులను ఒక కారులో బాబా సమాధి దగ్గరకి తీసుకెళ్ళి, తిరిగి వారెక్కడ ఉంటే అక్కడకి క్షేమంగా దించి వెళ్ళడమే వారి ప్రధాన ఆశయమని ఆమె ప్రకటించారు. అవసరమైనవారికి వీల్ చైర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, అవసర సమయంలో వైద్య సహాయం, వారంలో ఒక రోజున మెహెరాజాద్‌కు, మరో రోజున అహ్మద్‌నగర్ పట్టణ పర్యటన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సౌకర్యం వినియోగించుకోవాలనుకునే అవసరమైన బాబా ప్రేమికులందరూ ముందుగా తమ విన్నపాన్ని సదరు స్వచ్ఛంద సంస్థ యాజమాన్యానికి తెలియజేస్తే తగిన ఏర్పాట్లు వారు చేస్తారని అధ్యక్షులు, ఖమ్మం సెంటర్ శ్రీ రాయల రామచంద్రయ్య ఇటీవల చెప్పారు. ఈ మేరకు ఒక నిర్ణీత ధరఖాస్తు పూరించాలని ఆయన సూచించారు. ఏదిఏమైనా వయస్సురీత్యా బాధపడుతూ, బాబా సన్నిధిలో కొన్ని రోజులు గడపాలని తహతహలాడే బాబా ప్రేమికులందరికీ ఇది అవతారుడే స్వయంగా కలిపించిన సువర్ణావకాశంగా భావించాలని శ్రీ రాయల వారి అభిభావన.

**ఇక ఆలస్యం దేనికి?**

# గుజరాతీ సహవాస్

ఆ రాత్రి గుజరాతీ ప్రేమికులందరూ భజనలు, పాటలతో గడిపారు.
ప్రతిరోజూ బాబా మెహెరాజాద్‌కి వెళ్ళగానే ఇక ఆ రాత్రంతా బాబాకి సంబంధించిన అనేక కబుర్లు, ప్రేమికుల అనుభవాలు గురించి చర్చించుకుంటూ నిద్రలోకి జారుకునేవారు. నాగపూర్ నుంచి వచ్చిన బాబా ప్రేమికుడు డా॥ సి.డి. దేశ్‌ముఖ్ నవంబర్ మాసంలో ఏర్పాటు చేసిన నాలుగు ప్రాంతీయ సహవాస్‌లలో పాల్గొనేందుకు సిద్ధమై వచ్చాడు.
ఆయన రాత్రి 8 గంటలు అవ్వగానే నిద్రలోకి జారుకునేవాడు.
తిరిగి తెల్లవారుఝామున మూడు గంటలకే లేచి బాబా ప్రార్ధనలు, భజనలు చేయటం ప్రారంభించేవాడు. ఇది కొంతమందికి ఇబ్బందికరంగా ఉండేది.
రాత్రిపూట కొద్దిగా లేటుగా పడుకునేవారికి ఇదీ మరీ ఇబ్బందికరంగా వుండేది.
ధాకేఫాల్కర్ ఆ కోవకు చెందినవాడు.
తెల్లవారుఝామున మూడు గంటలకే లేచి, బిగ్గరగా భజనలు చేస్తున్న డా. సి.డి. దేశ్‌ముఖ్‌ని "నిన్నేమైనా బాబా తెల్లవారుఝామున మూడు గంటలకు పార్ధనలు చేయమని అడిగారా?" అది బాబా ఆదేశాలు కాకపోతే, అది బాబా కోరిక కాకపోతే, మమ్మల్ని ఇబ్బంది పెట్టే అధికారం నీకు ఎవరిచ్చారని వాదనకు దిగాడు.
ఈ మాదిరిగా ఈ సహవాస్‌లో పాల్గొన్న నూరు మంది గుజరాతీ ప్రేమికులది ఒక్కొక్కరిదీ ఒక్కొక్క కహాని.
నవంబర్ 7న ఉదయం 8 గంటలకల్లా మెహెర్‌బాబా మెహెరాబాద్ వచ్చారు.
ఏరుచ్, కాకాబారియా, కిషన్ సింగ్ కూడా బాబాతో ఉన్నారు.
ఆ రోజు వాతావరణమంతా చాలా తేలికగా సంతోషంగా ఉంది.
బాబా కూడా జోకులు వేసి అందరినీ సంతోషపెట్టారు.
నాకు హాస్యమంటే చాలా ఇష్టమన్నారు బాబా.
నేను ఎన్నింటిని వదులుకున్నా అనాదిగా నా హాస్యాన్ని మాత్రం వదిలిపెట్ట లేదు.
క్రీస్తుకి ఒకసారే శిలువ వేసారు.
కానీ, నాకు ప్రతి సెకను శిలువ వేయబడినంత కష్టాల్ని అనుభవిస్తున్నాను.
అయినప్పటికీ నా హాస్యాన్ని నన్నంటిపెట్టుకుని ఉండటంవల్ల నేను అనుభవించే కష్టాలు భరించేందుకు సహాయపడుతోంది.
ఆ తర్వాత బాబా ఉపవాసానికి ఎంపిక చేసిన ఐదుగురు ప్రేమికుల్ని కలిసారు.

ఒక్కొక్కరికీ రెండేసి నిముషాల చొప్పున సమయం కేటాయించి వారితో మాట్లాడారు.
ఈ సమయంలోనే మదన్ అనే బాబా ప్రేమికుడు తనతో తీసుకువచ్చిన
చిన్న ఆయింట్‌మెంట్ డబ్బాను బాబాకి చూపించాడు.
ఈ అయింట్‌మెంట్‌తో ఏరుచ్ బంధువు ఒకరికి గొంతునొప్పి తగ్గించానని
మదన్ చెప్పాడు. అతను గొంతునొప్పితో తీవ్రంగా బాధపడుతుండేవాడని
డాక్టర్లు ఆపరేషన్ చేయాలని సూచించారని అయితే నేను ఈ ఆయింట్‌మెంట్‌ని
నీ నామం తలుస్తూ అతనికి వైద్యం చేశానని ప్రస్తుతం అతని
గొంతునొప్పి మటుమాయమయ్యిందని మదన్ చెప్పాడు.
బాబా నా నామం తలుచుకోవడం మరిచిపోవద్దని సలహా ఇస్తూ,
చాలాకాలం నాటి బైదుల్ సంఘటన ఒకదాన్ని గుర్తుచేశారు.
ఆ రోజుల్లో బైదుల్ ఇరాన్‌లో ఉండేవాడు.
నీళ్ళలో మరిగించిన వెల్లుల్లి నూనెతో అనేక మందికి
బైదులు దీర్ఘకాలిక రోగాలనెన్నింటినో నయం చేశాడు.
తన దగ్గరకొచ్చే ప్రతిరోగికీ రోగమేదైనా మందు ఒక్కటే అన్నట్లు బైదులు
నా నామం తలుచుకుంటూ ఈ మందుని వారికిచ్చేవాడు.
జలుబు, దగ్గు, నిమోనియా, టైఫాయిడ్, మలేరియా మరి కంటి జబ్బులకి
కూడా ఇదే మందు నా నామంతో ఇచ్చి వారి రోగాలను నయం చేశాడు.
మనుషులకే కాదు, గుర్రాలు, గాడిదలు, గేదెలకు కూడా
బైదులు ఈ మందుని ఉపయోగించాడు.
ఇది నా మహత్యం కాదని అంటూ బాబా, నాపై ఉన్న నమ్మకంతో
బైదుల్ తన వైద్యం చేసాడన్నారు.
ఇలా అనేక విషయాలు సహవాసీలతో ముచ్చటించి
ఆ పిదప అందరూ మధ్యాహ్న భోజనానికి వెళ్ళారు.
మధ్యాహ్నం టీ తీసుకుని, తిరిగి మెహెరాబాద్ మండలి హాలులో హాజరైన ప్రేమికులతో
మీరందరూ ఇక్కడకి రావడం నాకెంతో సంతోషంగా ఉందన్నారు.
మీ తరువాత తెలుగువారు వస్తారని వారందరూ భజనలు, కీర్తనలు,
ఆరతి ఆలాపించడం పట్ల ఆసక్తి కనపరుస్తారని అన్నారు.
అదే పార్శీయుల భక్తి విధానం హిందువులతో పోల్చితే ప్రత్యేక రీతిలో ఉంటుందన్నారు.
దక్షిణాదివారు పార్శీయుల కంటే మిన్నగా బాబా కార్యక్రమాలు
ఎంతో ప్రేమతో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారన్నారు.
తెలుగు బాబా ప్రేమికులతో సరి పోల్చదగ్గవారు హమీపూర్ వాసీలు మాత్రమే అన్నారు.
తెలుగువారిలో రాష్ట్ర మంత్రి దగ్గర నుండి కూలీ పనివారి వరకు

బాబా పనిని ఎంతో నిజాయితీతో నిర్వహిస్తున్నారన్నారు.
గ్రామ గ్రామానా బాబా ప్రేమ సందేశాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో మహారాష్ట్రీయులు ఏమాత్రం వెనుకబడలేదన్నారు. నేను జొరాష్ట్రియన్‌గా జన్మించినందువల్ల పార్శీయులేమీ తమ వాళ్ళుగా గర్వపడటంలేదన్నారు.
అనాదిగా ఏ సద్గురువుని ఆయా కాలంలో ఆయా వర్గీయులు ఆయా సంబంధిత వర్గీయులు గుర్తించ లేదు, గౌరవించనూ లేదు.
ఇలా ప్రతి అవతార కాలంలోనూ జరుగుతోంది.
పార్శీయులు ఈ విషయాన్ని తెలుసుకోవాలి.
పార్శీయుల మనస్థత్వం ఎలాంటిదంటే -
"రేపు ఏమి జరుగుతుందో ఎవరికి ఎరుక అన్నది"
ఈ తత్వం నాకూ ఇష్టమే అన్నారు బాబా.
సందేశాలు, ప్రవచనాలు, భక్తి ప్రపత్తులతో భజన గీతాల ఆలాపన ఇవన్నీ మానవ జీవిత లక్ష్యమైన భగవంతుని దరికి చేర్చలేవు.
వాటికంటూ ప్రత్యేకంగా విలువేమీ లేదు.
మరి ఏం కావాలి అంటే, మంచి హృదయం కావాలి.
**"హాఫీజ్ ఏమన్నాడంటే,**
**దేవుని కోసం ప్రేమతో ఎవరైతే తమ జీవితాన్ని**
**పణంగా అర్పించే ధైర్యం ఉండదో అలాంటి వారికి**
**భగవంతుడు లభించడన్నాడు".**
దేవుని కోసం ప్రేమతో జీవితాన్ని పణంగా అర్పించటమంటే అర్థం వివరిస్తూ, బాబా ఇలా అన్నారు. కొన్ని వేలమంది సైనికులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోతారు. మరికొంతమంది ఆత్మహత్యలు చేసుకుని జీవితాన్ని ముగిస్తారు. అయితే ఇది అలాంటి మరణం కాదు. ఇక్కడ జీవితాన్ని పణంగా పెట్టడమంటే గురువు కోసం తాను ప్రేమించే సద్గురువు కోసం ఆయన ఇచ్ఛ నెరవేర్చడం కోసం ప్రతిక్షణం ప్రతి అడుగులో ప్రాణాలు అర్పించటమే.
నేను గతంలో అనేకమార్లు నాపట్ల ప్రేమ - విధేయతతో ఎలా ఉండాలో ఎంతో వివరంగా చెప్పాను.
ఆ విషయాలను మీరు ఆచరణలో అమలు చేయగల్గితే మీకు మీరుగా నా కోసం సర్వార్పణ చేసుకున్నట్లే అవుతుంది.
నిరంతరం నా నామ స్మరణలో గడపడం ద్వారా మీకు నా దర్శనం అణువణువునా ప్రతి దానిలో కనిపిస్తుంది.

నేను పార్సీ వాడినైనా నాకు అన్ని మతాలు, అందరూ సమానమే.
భగవద్వచనం గ్రంధాన్ని ప్రతి ఒక్కరూ తప్పక చదివే ప్రయత్నం చేయండి.
ఆ పుస్తకం మీ అందరి దగ్గరా వుంటే బాగుంటుంది.
అది ఒకవేళ మీరు ఆ పుస్తకాన్ని కొని చదవలేకపోయినా మీకు తెలిసిన వారి వద్ద నుండి తీసుకుని చదివే ప్రయత్నం చేయండి.
అయితే మీకు చదవడం రానిపక్షంలో తెలిసిన వారి నెవరిచేతనైనా చదివించుకోండి.
భగవద్వచనంలో నేను అనేక ఆధ్యాత్మిక ధర్మ సూక్ష్మాలు వెల్లడించాను.
ఆ గ్రంధంలో ఏడు భూమికలు, ఈ ప్రపంచం, భగవంతుడు మరియు నా గురించి ఎంతో వివరంగా చెప్పాను.
సాధ్యమైనంత మేరకు అన్ని భారతీయ భాషలోకి ఆ గ్రంధాన్ని అనువదించండి.
పాశ్చాత్యులు అనేకమంది అనేక విదేశీ భాషలోకి ఈ గ్రంధాన్ని ఇప్పటికే అనువదించారు.
ఈ గ్రంధం ఆసాంతం చదివాక మీకు నా దర్శన భాగ్యం లభించిన అనుభూతిని మీరు పొందుతారు. ఈ గ్రంధం చదివాక మీ మనస్సుకి ఎంతో ఊరట లభించిన అనుభూతి మీరు పొందుతారు.
చివరిగా తన సందేశాన్ని ముగిస్తూ మీరు నా నామస్మరణ నిరంతరం చేయలేకపోతే కనీసం రాత్రి పడుకునే ముందు, అలాగే తెల్లవారగానే మంచంపై నుండి లేచేముందు నా నామం తలుచుకునే ప్రయత్నం చేయండి.
అదీ కుదరని పక్షంలో మీ శరీరం వదిలే ముందు, నా నామం తలుచుకోండి.
మీకు నా దివ్య దర్శన భాగ్యం లభిస్తుంది.
ఇది నా దివ్యాధికారంతో చెప్తున్నానని బాబా అన్నారు.
ఆ తర్వాత భజన గీతాలు ఆలాపిస్తుండగా బాబా మెహెరాజాదుకు కారులో బయలుదేరి వెళ్ళారు.
ఆ మర్నాడు వారం రోజుల సహవాస్ కార్యక్రమంలో చిట్టచివరిరోజు.
ఆ రోజు ఉదయం 8.15 నిముషాలకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమం మేరకు సహవాసీలందరూ మెహెరాజాదుకు చేరుకున్నారు.
వీరి రాక కోసం బాబా ఎదురు చూస్తున్నారు.
అవతార్ మెహెర్‌బాబాకీ జై అంటూ బిగ్గర నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. సహవాసీలందరూ బాబా ఎదుట హాజరయ్యారు.
ఆ తదుపరి బాబా అందర్నీ పింపల్‌గాం కొండపైకి తీసుకెళ్ళారు.
బాబా అందరికంటే ముందుండి నడుస్తూ వెనుక వచ్చేవారందర్నీ ఒకంట

చూస్తూనే వున్నారు. వయస్సు పైబడ్డవారు ఎలా రాగల్గుతున్నారో చూస్తూ వారికోసం అడపా దడపా కొద్దిసేపు ఆగుతూ, దార్లో చిన్న చిన్న రాళ్ళు చేత్తో తీసుకుని విసిరేస్తూ బాబా ముందుకు నడిచారు. బాబా ప్రక్కనే పాపా జస్సాసాలా వున్నారు.
అయితే బాబా చిన్ననాటి స్నేహితుడు సైలర్ మాత్రం చాలా దూరంగా వున్నాడు.
అతని కోసం కొద్దిసేపు ఆగిన బాబా – సైలర్ తనకు చిన్ననాటి స్నేహితుడన్నారు.
ఆ రోజుల్లో అతనికి నాపై నమ్మకం తక్కువగా వుండేది.
నా ఆధ్యాత్మిక స్థితి గురించి అతనికేమీ తెలిసింది కాదు.
సైలర్ గొప్ప అథెలెట్. నేను సన్నగా బక్కపలచగా వుండేవాడిని.
ఒకరోజు నేను అతని ఇంటికి వెళ్ళితే చమత్కారంగా
నాపై తన బలప్రదర్శన చేయబోయాడు.
నేను దాన్ని వారిస్తూ ఒక తోపు తోస్తే,
అంత పెద్ద బలమైనవాడు పది అడుగుల దూరం పోయి పడ్డాడు.
అది ఆనాటి సంగతి.
ఆ తర్వాత సైలర్ నన్ను అనుసరిస్తూ నవజీవనం సమయం దాకా
మెహెరాబాద్‌లో చాలాకాలం వున్నాడు.
చూడండి ముసలి వాడైనా పాపా జస్సావాలా నాతో సమంగా కొండెక్కుతుంటే,
అంతగొప్ప అథెలెట్ అల్లంత దూరంలో ఆపసోపాలు పడుతున్నాడని
బాబా నవ్వుతూ సైలర్ కోసం కొద్దిసేపు ఆగారు.
కొండ ఎక్కాక బాబా కొండపైన నిర్మించిన రెండు క్యాబిన్‌లను చూపించారు.
తాను ఏకాంతవాసం చేసిన ప్రాంతం, ఆనాటి విశేషాలు ప్రేమగా వివరించారు.
అనంతరం అందరూ కొండ దిగి మండలి హాలులో బాబా చుట్టూ చేరారు.
అందరూ గలగలా జోకులు వేస్తూ బాబాతో సంతోషంగా కబుర్లు చెప్పారు.
ఈ సందర్భంలో తిరిగి బాబా తెలుగువారి ప్రస్తావన తెస్తూ,
మీరందరూ నా సమక్షంలో నవ్వుతూ, తుళ్ళుతూ హాస్యంగా వున్నారు.
అదే తెలుగువారు నన్ను చూస్తూనే వాళ్ళ హృదయం ద్రవిస్తుంది.
ఆర్ద్రతతో మౌనంగా కన్నీరు కారుస్తారు.
నా సమక్షంలో వారందరి కళ్ళల్లో నీళ్ళు చిప్పరిల్లుతాయి.
నాకు ఈ రెండు వాతావరణాలు ఇష్టమే అన్నారు.
ఇంతలో సహవాసీలలో ఒకరు లేచి, ఫిబ్రవరి 15, 1956 నుండి
నీవు చేపట్టే కార్యక్రమానికి సహకరించేందుకు మహిళలు విరాళాలు ఇవ్వవచ్చా అని అడిగాడు.
ప్రతి ఒక్కరూ వారికి తోచిన రీతిలో కనీసం 5 రూపాయల నుండి 5 లక్షల

వరకూ విరాళం పంపవచ్చన్నారు.
అయితే, గడప గడపకీ వెళ్ళి వారందర్నీ ఇబ్బంది పెట్టి మాత్రం విరాళాలు సేకరించి పంపవద్దని బాబా సూచించారు.
స్వచ్ఛందంగా ప్రేమతో ఎవరెంతిచ్చినా మంచిదేనన్నారు.
ఆ రోజు సాయంత్రం మెహెరాబాద్‌లో కవ్వాలి కార్యక్రమం ఏర్పాటుచేశారు.
మెహెరాబాద్‌కి వెళ్ళి భోజనం చేసుకొని, విశ్రాంతి తీసుకొని కవ్వాలి కార్యక్రమానికి హాజరుకమ్మని బాబా అన్నారు. చాలా మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.
ఎంతో దూర ప్రాంతాల నుండి ఈ కవ్వాలి బృందం వస్తోందన్నారు బాబా.
కవ్వాలిలో చిన్న చిన్న పదాలలో ఎంతో గూడార్థం దాగి వుంటుంది శ్రద్ధగా ఆలకించండి. మధ్యమధ్యలో నిద్రపోకండి అని బాబా హెచ్చరించారు.
అందుకే ముందుగా మెహెరాబాద్‌కి వెళ్ళి మధ్యాహ్న భోజనం అయ్యాక, ఒక గంటసేపు నిద్రపోండి అని సలహా ఇచ్చారు.
మెహెరాబాద్‌లో సహవాసీలందరికీ బ్లూ బస్సును చూపించారు.
ఆ బస్సులో మండలివారందరితో కలసి చేసిన ప్రయాణ విశేషాలు చెప్పారు.
మెహెరాజాద్‌లో పూల తోటల్నీ మొదటి అంతస్థులో వున్న తన గదిని బాబా చూపించారు.
మెహెరాజాద్‌లో పరిసరాలు పచ్చగా, ఆహ్లాదంగా వున్నాయని ఎవరో ఒక ప్రేమికుడు అనగానే నేను ఎలాంటి ప్రాంతంలోనైనా వుండగలనని బాబా అన్నారు.
ఆరుబయట చెట్టుక్రింద పడుకుంటానికైనా,
అదే సమయంలో అత్యంత అందమైన ఖరీదైనా భవంతిలోనూ రెంటినీ సమంగానే భావిస్తానన్నారు. నేడైతే మెహెరాజాద్‌లో అంత అందంగా కనిపిస్తోంది గానీ, 1920వ దశకంలో మెహెరాబాద్‌లో ఎంత కఠినమైన జీవనం గడిపామో మీరు ఊహించలేరు. కొన్ని వేల మైళ్ళు కాలి నడకన ప్రయాణం చేశాను. రైళ్ళల్లో, బస్సుల్లో ప్రయాణం చేస్తూ రాత్రి బస, రైల్వే ఫ్లాట్ ఫారం మీదనే గడిపిన రోజులు ఎన్నో వున్నాయి. ఒకసారి గుజరాత్‌లో ప్రయాణం చేస్తున్నాం. రైల్వే ఫ్లాట్ ఫారం పైనే నేను పడుకున్నాను. అర్ధరాత్రి వేళ ఒక దొంగ, పోలీసుల బారి నుండి తప్పించుకోవడానికి వచ్చి నా ప్రక్కనే పడుకుని నా దుప్పట్లో దాక్కున్నాడని బాబా అన్నారు. ఆదరిమలా అందరూ మెహెరాబాద్‌కి తిరిగి వచ్చారు.
కవ్వాలి కార్యక్రమం ఎగువ మెహెరాబాద్‌లో వాటర్ ట్యాంక్ సమీపంలో ఏర్పాటుచేశారు. దిగువ మెహెరాబాద్‌లో కంటే ఈ ప్రాంతంలో కార్యక్రమం బాగా వినపడుతుందని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. కవ్వాలి కార్యక్రమం అనగానే అలోబా చెవి కోసుకుంటాడు. కార్యక్రమంలో మైమరచిపోతాడు. ఓ సందర్భంలో స్పృహతప్పి క్రిందపడిపోతాడు. ఇది తెలిసిన బాబా ఎందుకైనా మంచిదని మండలి సభ్యుడు

బైదుల్ అల్లుడు పేసీని అలోబాని ఓకంట కనిపెట్టమని బాబా నియమించారు. కవ్వాలి కార్యక్రమం ప్రారంభమైంది. అయితే ఈ దఫా అలోబా పడిపోలేదు. అలోబా కోసం నియమించబడ్డ పేసీ కార్యక్రమంలో లీనమై కన్నీటి పర్యంతమై క్రింద పడిపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని అలోబాని బాబా ప్రశ్నిస్తే కవ్వాలి సమయంలో తాను బాబా కేసి చూడకుండా వున్నానని అందువల్ల తన్మయం చెందలేదని జవాబిచ్చాడు. కవ్వాలి సాయంకాలం దాకా కొనసాగింది. అనంతరం బాబా అందరికీ ప్రేమగా వీడ్కోలు పలికి మెహెరాజాద్‌కి వెళ్ళిపోయారు. ఆ మర్నాడు అందరూ ఎవరి ప్రాంతాలకు వాళ్ళు బయల్దేరారు. మెహెరాబాద్‌లో సహవాస్ ప్రాంగణమంతా రాబోయే తెలుగువారి కోసం పరిశుభ్రం చేయడం ప్రారంభించారు.

**వచ్చే నెల సంచికలో 'తెలుగు సహవాస్ ధారావాహిక ప్రారంభం.**

# శ్రీ కాశీప్రసాద్



శ్రీకాకుళం బాబా కేంద్రానికి ఎనలేని సేవలందించిన శ్రీ కాశీప్రసాద్ 2014 జూన్ 9న స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస వదిలాడు. జూన్ 6 ఉదయం తొమ్మిదిన్నర ప్రాంతంలో స్థానిక బాబా సెంటర్ పై అంతస్థు నుండి ప్రమాదవశాత్తు క్రింద పడి ఘోర ప్రమాదానికి గురయ్యాడు. ఆయన ఆకస్మిక మృతిపట్ల బాబా ప్రేమికులందరూ తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశారు. 15 నెలల పసితనంలోనే తల్లితండ్రులతో కలిసి అవతారుని పాదపద్మముల దివ్య స్పర్శచే పునీతుడైన ధన్యజీవి అని, ఆతని ఆత్మకు అవతారుడు శాంతిని చేకూర్చాలని స్థానిక బాబా ప్రేమికులు వేడుకున్నారు.

# వర్ని కేంద్రం 11వ వార్షికోత్సవం

నిజామాబాద్ జిల్లా వర్ని బాబా కేంద్రం 11వ వార్షికోత్సం 01.06.2014, ఆదివారంనాడు వైభవంగా జరిగింది. శ్రీ ఎ. జనార్ధనరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ పి.ఎస్.కె. శర్మ తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు. వర్ని, నిజమాబాద్, కామారెడ్డి, కంకల్, గుర్గుల్, సిరిసిల్ల, హైదరాబాద్ బాబా సెంటర్‌ల నుండి వెళ్ళిన బాబా ప్రేమికులు భజన గీతాలు, నామ్‌ధున్ కడు రమ్యంగా ఆలాపించారు.

# మెహెర్‌స్థాన్ ధర్మశాల

మెహెర్‌స్థాన్ ధర్మశాల 9వ వార్షికోత్సవము మరియు 168వ ప్రేమిక సహవాస్ 27.07.2014 ఆదివారం మెహెర్‌స్థాన్, కొవ్వూరులో ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ శ్రీధర్ కేల్కర్, ఛైర్మన్, అవతార్ మెహెర్‌బాబా పి.సి.సి. ట్రస్ట్, శ్రీ బి. రామకృష్ణయ్య, సో॥ తోట నాగేశ్వరరావు, శ్రీ కె.హెచ్.కె. ప్రసాద్, శ్రీ కోడూరి శివరామకృష్ణ తులసీ వరప్రసాద్, పాల్గొంటున్నారు. మెహెర్ ప్రభు చరితము ధారావాహికం సీరియల్‌ను శ్రీ ఉమామహేశ్వర సింగ్, హైదరాబాద్ నిర్వహించనున్నారని ఆహ్వానంలో పేర్కొన్నారు.

# ఖోజాగూడలో ప్రేమిక సహవాస్

2014 జూలై 12న హైదరాబాద్‌లోని ఖోజాగూడలో గల మనోనాశ్ కొండపై ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఉ. 8 నుండి 12 గంటల వరకు నిర్వహించారు. అలాగే, ఆ రోజు సాయంత్రం 4 నుండి 8 గంటల వరకు కోఠి సెంటర్ 41వ వార్షికోత్సవం మరియు 'గురు పూర్ణిమ' సందర్భంగా ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేశారు. ఈ రెండు కార్యక్రమాలలో డా॥ సైరస్ యం ఖంబాటా, ముంబాయి సెంటర్ ప్రత్యేక అతిథిగా పాల్గొని బాబా సందేశాలపై ప్రసంగించారు.

# విశాఖ 43వ వార్షికోత్సవం

విశాఖపట్నం బాబా సెంటర్ 43వ వార్షికోత్సవం 2014 జూన్ 8 ఆదివారం ఘనంగా జరుపుకున్నట్లు కార్యదర్శి శ్రీ ఎన్.వి.ఎస్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సన్యాసి రాజు సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. శ్రీ కె.వి.రత్నం, డా॥ కె. మళయవాసిని శ్రీ నేరెళ్ళ నారాయణమూర్తి, శ్రీమతి డా॥ సి.హెచ్. ఉషాదేవి బాబా సందేశాలపై ప్రసంగించారు.



# బాబాలో ఐక్యం

❋ శ్రీ కుప్ప వెంకటేశం (85) ది. 17.05.2014న బాబాలో ఐక్యమయ్యారని కార్యదర్శి శ్రీ ఎన్.వి.ఎస్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

❋ బాబా ప్రేమికులు శ్రీ ఎన్. సుబ్బారావు డ్రాయింగ్ మాస్టారు, విశాఖ ది. 16.06.2014న బాబాలో ఐక్యమయ్యారు.

# మౌన వార్షికోత్సవం



మెహెర్‌బాబా ప్రేమికులు చాలా మంది జూలై 10వ తేదీన మౌనం పాటించినట్లు సమాచార భోగట్టా. హైదరాబాద్‌లోని కోఠి, జూబ్లీ బాబా సెంటర్లలో, అలాగే తెలుగునాట గల వలు బాబా సెంటర్లలో మౌన వార్షికోత్సవం రోజున విచ్చేసే బాబా ప్రేమికుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కాగా, ఎప్పటిలాగానే

ఈ ఏడాది పలువురు ప్రేమికులు మెహెరాబాద్ బాబా సమాధి దగ్గర మౌనం పాటించేందుకు మెహెరాబాద్ వెళ్ళారు. మెహెరాబాద్‌లో తెలుగువారితోపాటు ఉత్తరాదివారు తదితరులంతా కలిసి సుమారు రెండు వేలమంది మెహెరాబాద్ విచ్చేశారు. డి - హాస్టల్లో 1100 మంది దాకా బస చేశారు. ఆంధ్రా రెస్టుహౌసులో సుమారు 300 మంది వసతి కలిపించారని అంచనా. ఈ ఏడాది జనవరి 31న అమరతిథి ముగిసిన లగాయితు పూణే, పావగడ, బెంగళూరులలో జరిగిన ప్రేమిక సహవాస్‌లతోపాటు స్థానికంగా గల బాబా సెంటర్‌లలో కూడా మౌన వార్షికోత్సవ కార్యక్రమం కోసం తగిన ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేయడంతో, మెహెరాబాద్‌కు విచ్చేసిన ప్రేమికుల సంఖ్య గత ఏడాదిలతో పోల్చితే ఈసారి కొద్దిగా తగ్గిందని చెప్పాలి. ఏతావాతా చెప్పుకోవల్సిన విషయం ఏమంటే, ఈ దఫా మౌనం రోజున మెహెరాబాద్‌లో తెలుగువారి సందడి తక్కువగానే వుంది. జూలై 12వ తేదీ గురువారం, గురు పూర్ణిమ పవిత్ర పండుగ రోజు కావడంతో మెహెరాబాద్‌కు విచ్చేసిన ప్రేమికులు చాలామంది, ధుని కార్యక్రమంలో కూడా పాల్గొని జూలై 13 - 14 తేదీలలో తమ స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. మౌనం రోజున మెహెరాబాద్ వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది. ఆ రోజున ఆకాశం నిర్మలంగా వుంది. జూలై 10 మౌన దినం రోజున, అలాగే అంతర్క్రితం రోజున మెహెరాబాద్‌లో మంచి వానలు కురిసాయి. జూలై 10 నాడు తరచు వర్షం

కురిసింది. ఆ రోజు సాయంత్రం చలిగాలులు వీచాయి. మెహెరాబాద్ ఊటీలో వున్నట్లుందన్నారు శ్రీ సి.వై. చింతామణి, విజయనగరం. మౌనం రోజున ఎ-హాస్టల్‌లో మెహెరుడి సందేశాలపై సినిమా ప్రదర్శించారు.

డి-హాస్టల్ సమీపంలో ఎప్పటిలాగానే బుక్ స్టాల్స్, బాబా ఫోటో స్టాల్స్ ఏర్పాటు జరిగింది. ఆంధ్రా రెస్టుహౌసులో మౌన వార్షికోత్సవం సందర్భంలో విచ్చేసే ప్రేమికుల కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ ఆంధ్రా రెస్టు హౌసు నుండి బాబా సమాధి దాకా ఉచిత ఆటో సర్వీసు నిర్వహించారు. వయస్సు రీత్యా పెద్దవారు ఇదొక అద్భుత అవకాశంగా భావించారు. అలాగే వయస్సులో పెద్దవారందరికీ మంచాలు, పరుపులు, చలిని తట్టుకోవడం కోసం దుప్పట్లు, రగ్గులు అందజేశారు.

మెహెరాబాద్‌లో నీటి సరఫరాలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా, లెక్కచేయని రీతిలో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి, రెస్టుహౌసులో బస చేసిన ప్రేమికులకు ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో శ్రీమతి వై.ఎస్. రావు, ఆమె కుమారులు తగిన జాగ్రత్త తీసుకున్నారు. వర్ధి సెంటర్ బాబా ప్రేమికులు స్వచ్ఛందంగా రెస్టుహౌసులో బస చేసిన ప్రేమికులకు చక్కని భోజన సౌకర్యం కల్పించారు.

రెస్టు హౌసు వారందించిన సేవలు ప్రశంశనీయం!!

జూలై 11వ తేదీన బాబా ట్రస్టు, మెహెరాజాద్‌లోని బాబావారి ఇంటికి తీసుకెళ్ళే ఏర్పాట్లు చేశారు. మౌన వార్షికోత్సవం కోసం వచ్చినవారిలో చాలామంది ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

## పుస్తకావిష్కరణ



బాబా ప్రేమికులు శ్రీ డి. శ్రీనివాసరావు, శ్రీకాకుళం రచించి, స్వరపరచిన **మెహెర్ మధుర స్వరావళి, ఆనంద నిధులు (6వ భాగం)** ఎగువ మెహెరాబాద్‌లోని జోపిడీ కేంద్ర సమీపంలో బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఆవిష్కరించారు. ఇప్పటి దాకా శ్రీ శ్రీనివాసరావు రచించి, ప్రచురించిన **మెహెర్ మధుర స్వరావళి,** ఐదు భాగాలలోని పాటలు బాబా ప్రేమికులు పలువురు ఆలాపిస్తుండగా మరో 50 రసగుళికల వంటి పాటలను ఈ గ్రంథంలో రచయిత శ్రీ డి. శ్రీనివాసరావు అందజేశారు. శ్రీ శ్రీనివాస రావు వృత్తి రీత్యా డెప్యూటీ తహసీల్‌దార్‌గా పదవీ విరమణ చేశాడు. మెహెర్‌బాబా సత్య ప్రేమ సందేశ వ్యాప్తి ఆయన ప్రవృత్తి అని చెప్పుకుంటారు. రాజాం బాబా సెంటర్ కార్యదర్శి శ్రీ పి.వి. రమణమూర్తి

దంపతులు రాజాం సెంటర్ తరఫున ఈ గీతావళిని ప్రచురించారు. పుస్తకం వెల అమూల్యం అని పుస్తకంలో ప్రచురించినా, పత్రికా ప్రకటనలో పుస్తకం ధర రూ. 30/- మాత్రమే అని పేర్కొన్నారు.
బాబా ప్రేమికుల ప్రతి ఇంటా వుండవల్సిన ఈ చిన్న పొత్తం కావల్సినవారు శ్రీ పి.వి. రమణ మూర్తి, కార్యదర్శి అవతార్ మెహెర్‌బాబా రాజాం సెంటర్, రాజాం, శ్రీకాకుళం జిల్లా, ఫోన్ 94408 87731 సంప్రదించగలరు.

# వృద్ధులకు మహదావకాశం!!

మెహెరాబాద్‌లో బాబా ప్రేమికులకు, ముఖ్యంగా వయస్సు రీత్యా పెద్దవారు, అనారోగ్యంతో, అంగవైకల్యంతో బాధపడుతున్నవారికి తగిన సహాయం అందించేందుకుగాను మెహెర్ కేర్ ట్రాన్స్‌పోటేషన్ సర్వీసెస్ ఈ స్వచ్ఛంద సంస్థ నొకదాన్ని క్రొత్తగా ఏర్పాటు చేసినట్లు శ్రీమతి కారన్ సయింట్ జాన్ (అమెరికా) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థ ద్వారా 2014 జూన్ 10 నుండి ప్రతిరోజూ సాయంత్రం మెహెరాబాద్‌లో బాబా సమాధి చెంత ప్రార్థనలు, ఆరతి, సమయానికి వృద్ధులైన బాబా ప్రేమికులను ఉచితంగా కారులో తీసుకెళ్ళే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
ఆంధ్రా రెస్టుహౌసు, యం.పి.ఆర్‌లలో బసచేసిన ప్రేమికులకు కూడా ఈ రవాణా సౌకర్యం అందజేయనున్నారు.
స్థానిక ప్రేమికులను ప్రతి మంగళవారం మెహెరాజాద్‌కు, ప్రతి గురువారం అహ్మద్‌నగర్‌కు తీసుకెళ్ళేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.
అవసరమైనప్పుడు దగ్గర్లోని ఆసుపత్రికి తీసుకెళ్ళే ఏర్పాటు కూడా చేస్తున్నట్లు తెలిపారు.
ఐతే, ఈ సౌకర్యం వినియోగించుకోవాలని భావించేవారు ముందుగా శ్రీమతి కారన్, మెహెరాబాద్, ఫోన్: 8308361292 (లేదా) 9096800939 లలో సంప్రదించి, తమ వివరాలు సుమారు 10 రోజులు ముందుగా నమోదు చేయించుకోవాలని వారు మనవి చేశారు.

## వివాహం

శ్రీమతి కర్రి హిమబిందు, శ్రీ కర్రి మురళీధర్ గార్ల ఏకైక కుమార్తె చి॥ల॥సౌ॥ మెహెర్ శాంతి వివాహం చి॥ చంద్రశేఖర్ తో 13.08.2014 బుధవారం రాత్రి గం॥ 12.38 ని॥లకు ఏలూరు, శనివారపుపేట, శ్రీరామ్‌నగర్ 12వ రోడ్‌లో గల సారధి గ్రాండ్ ఫంక్షన్ హాలు నందు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# బెంగళూరులో బాబా సహవాస్

**పి.యస్.కె.శర్మ, హైదరాబాద్**



బెంగళూరులో బాబా సహవాస్ రెండ్రోజులపాటు 2014 జూన్ 14,15 తేదీలలో ఘనంగా జరిగింది. బెంగళూరు జయానగర్‌లో శ్రీ ఏ. రాజగోపాల్ గారి ఇంట్లో చాలా కాలంగా బాబా సెంటర్ నిర్వహిస్తున్నారు. కాగా, ఆ సెంటర్‌లో రాజస్థాన్‌లో నూతనంగా పాలరాతితో తయారు చేయించిన మెహెర్‌బాబా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ ప్రత్యేక సహవాస్‌ను ఏర్పాటు చేశారు. మెహెర్‌బాబా తెల్లని సాద్రా ధరించి, గులాబీ కోటుతో సోఫాలో కూర్చున్నట్లు ఉండే విగ్రహాన్ని శిల్పి చాలా చక్కగా చెక్కాడు. బాబా ఎదుట కూర్చున్న ప్రేమికులకి బాబా తమకేసే చూస్తున్నట్లు ఉంది. గతంలో జయానగర్‌లో శ్రీ రాజగోపాల్ వుంటున్న ఇంటిని పూర్తిగా మరమ్మత్తులు చేయించి రెండస్తుల భవనాన్ని నిర్మించారు.

సెల్లార్ పైభాగంలో ప్రత్యేకంగా బాబా కోసం ఒక విశాలమైన గదిని ప్రార్థనా మందిరంగా మలిచారు. బాబా భజనలు, సంకీర్తన, నామస్మరణ చేసుకుందామనే ప్రేమికులకు అనువుగా ఈ ప్రార్థనా మందిరాన్ని అన్ని సౌకర్యాలతో చక్కగా తీర్చిదిద్దారు. బాబా సెంటర్ ప్రారంభోత్సవం జూన్ 14, శనివారం ఉదయాన్నే లాంఛనంగా పూర్తయ్యాక దగ్గర్లోనే గల ఆడిటోరియంలో ప్రేమిక సహవాస్ నిర్వహించారు. మెహెరాబాద్ నుండి బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్, శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, శ్రీ రమేష్ జంగ్లీ, శ్రీ ప్రతాప్ ఆహిర్, శ్రీ దిగంబర్ గాడేకర్‌లతో పాటు తెలుగు ప్రాంతం నుండి అనేకమంది బాబా ప్రేమికులు ఈ సహవాస్‌కు హాజరయ్యారు. సహవాస్ కార్యక్రమాన్ని శ్రీ సంతోష్ తదితర యువ బాబా ప్రేమికులు నిర్వహించారు. అహ్మద్‌నగర్, పూణే భజన మండలివారితో పాటు చెన్నై నుండి వచ్చిన శ్రీనిబాబా బృందం, కర్నాటక, ఆంధ్రా బాబా సెంటర్‌ల నుండి పలువురు ప్రేమికుల భజన గీతాలాపనలు, నామ్‌ధున్ ఆకర్షణీయంగా జరిగాయి. సహవాస్ తొలిరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి సుమారు రెండు గంటలపాటు బాబా నామం బిగ్గరగా చేస్తూ నగర సంకీర్తన నిర్వహించారు. ఎత్తైన వాహనంపై

బాబా చిత్రపటం వుంచి, బారులు తీరిన బాబా ప్రేమికులు నామస్మరణ చేస్తూ ముందుకు సాగుతుంటే స్థానిక బెంగళూరు ప్రజానీకం ఈ శోభాయాత్రను చూసి అబ్బురపడినట్లు సమాచారం. కాగా శ్రీనిబాబా, చెన్నై, ఆయన మిత్రులు, ప్రముఖ నృత్య దర్శకులు శ్రీ జోస్యుల సూర్యనారాయణ గారి దర్శకత్వంలో **జయహో మెహెర్‌బాబా** నృత్యరూపకం పలువుర్ని ఆకర్షించింది. బెంగళూరు బాబా ప్రేమికులు శ్రీ రఘుపతిరావు మెహెర్‌బాబా 1930వ దశకంలో బెంగళూరు, మైసూరు, భైరమంగళలో జరిపిన పర్యటన వివరాలపై చక్కని ప్రసంగం చేశారు. మెహెర్‌బాబా బెంగళూరులో నిర్వహించిన మస్తు ఆశ్రమం గురించి, భైరమంగళలో విశ్వ ఆధ్యాత్మిక కేంద్రానికి జరిపిన శంఖుస్థాపన గురించి శ్రీ రఘుపతి అనర్గళంగా ప్రసంగించారు. భైరమంగళలోని విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర వివరాలు తెలియజేస్తూ, ప్రతి బాబా ప్రేమికుడు ఆ కేంద్రాన్ని ఒక్కసారైనా దర్శించాలన్నారు.

బాబా ట్రస్టు, చైర్మన్ శ్రీధర్ కేల్కర్ మెహెర్‌బాబా ట్రస్టు నిర్వహణ గురించి తెలియజేశారు. బాబా ట్రస్టు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి వీలుగా బాబా ప్రేమికులు విరివిగా విరాళాలు అందించాలని కోరారు.

శ్రీ రమేష్ జంగ్లీ, మెహెరాబాద్‌లో ప్రతి నెలా 12వ తేదీన వెలిగించే ధుని ప్రాశస్త్యాన్ని వివరించారు. గ్లో – మాస పత్రిక సంపాదకుడు శ్రీ నౌషర్‌వాన్ అంజార్ మాట్లాడుతూ బాబా నామం నిరంతరం స్మరించడం ద్వారా తమ భవబంధనాల నుండి బాబా ప్రేమికులు దూరం కాగలరన్నారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, హైదరాబాద్ బాబా సందేశాలపై ప్రసంగిస్తూ **అవతారుని హాస్యం** గురించి తెలియజేశారు. స్థానిక యువ బాబా ప్రేమికుడు, శ్రీ నిఖిల్ బాబా సందేశం **ప్రేమ–త్యాగం** గురించి సభికుల్ని ఆలోచింపజేశేలా ప్రసంగించాడు.

శ్రీ దిగంబర్ గాడేకర్ గత మూడు తరాలుగా బాబా ప్రేమలో తాము తరిస్తున్నామన్నారు. తన తండ్రి రామచంద్ర గాడేకర్, తాత గారు కానోజ్ గాడేకర్ బాబాను దర్శించుకుని ఆయన సేవలో తరించారన్నారు. కానోజ్ గాడేకర్ ఒక నిరుపేద హరిజనుడు. బాబా పాదాలకు చెప్పులు కుట్టి ఇచ్చి బాబా మెప్పు పొందిన ధన్యుడాయనన్నారు. మా తండ్రి రామచంద్ర గాడేకర్ బాబాను తన 19 సంవత్సరాల వయస్సులో దర్శించుకున్నాడు. అప్పట్లో ఆయన తీవ్ర కడుపునొప్పితో బాధపడేవాడు. బాబాను తొలిసారిగా దర్శించుకునేందుకు వెళ్ళింది మాత్రం తన కడుపు నొప్పికి మందు అడుగుదామని వెళ్ళి, తీరా బాబాను చూస్తూ అలాగే నిల్చుండిపోయాడాయన. ఎందుకు వచ్చావ్? అని బాబా ప్రశ్నించడంతో తిరిగి లోకంలోకి వచ్చిన మా నాయన భగవత్ సాక్షాత్కారం కోసం వచ్చానన్నాడు.

ఆ మాటలు విని బాబా నవ్వుతూ కడుపు నొప్పికి కొన్ని మందులు ఇచ్చి పంపారు.

ఆ తర్వాత బాబావారు నడిపిన హజరత్ బాబాజాన్ స్కూల్లో టీచర్‌గా కూడా అయన పనిచేశాడని ఆనాటి వివరాలు తెలియజేశాడు శ్రీ దిగంబర్ గాడేకర్.
తన తండ్రి చివరి రోజుల్లో కాన్సర్‌తో బాధపడ్డాడన్నారు.
1959 మార్చి 12న ఆయన బాబాలో ఐక్యమయ్యారు.
ఐతే, అంతక్రితం మూడ్రోజుల ముందు పూణేలోని మా ఇంటికి తన మండలివారితో కలిసి వచ్చారు. ఆ రోజు మహా శివరాత్రి పర్వదినం. పరమేశ్వరుడు మీ ఇంటికి వచ్చాడు. కనులారా దర్శించుకోమని బాబా మా నాన్నతో అన్నారు.
ఆ సమయంలో బాబాతో వచ్చిన మండలివారినందరినీ గది బయట ఉండమన్నారని ఆనాటి జ్ఞాపకాలు గుర్తుచేశారు శ్రీ దిగంబర్ గాడేకర్.
దిగంబర్‌జీ ప్రసంగం ఆద్యంతం హృద్యంగా కొనసాగింది.
శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ తన ప్రసంగంలో మన్సారీకి సంబంధించిన ఒక ఆసక్తికర సంఘటన చెప్పారు. మన్సారీమాయి బాబా మండలిలో చేరక పూర్వం, ఆమె తొలినాళ్ళలో మెహెరాబాద్‌లో బాబా సన్నిధిలోకి వచ్చినప్పటి విషయమిది.
ఆమె ఒక రోజున బాబాతో " నీవు ఏ పనిని అప్పగించినా నేను చేసేందుకు సిద్ధంగా వున్నానని" అంటుంది. మెహెరాబాద్‌లోనే వుంటున్న వాలూ అనే బాబా ప్రేమికురాలు అప్పటికే జ్వరంతో బాధపడుతోంది.
ఆమెకు సహాయంగా సపర్యలు చేసేపనిని మన్సారీకి బాబా అప్పగించారు.
వాలూ అంటే ఎవరనుకున్నారు?
మెహెరాబాద్‌లో పని చేసే ఒక సామాన్య సేవకురాలు.
కేవలం సేవకురాలే కాదు.. బాబాను భగవంతునిగా ఆరాధించే ప్రేమికురాలు కూడా.
ఐనప్పటికీ మన్సారీమాయి బాబాతో .."నేను నీకు సేవ చేసేందుకు వచ్చాను కానీ... మీ సేవకురాలుకు చేయలేనని కచ్చితంగా తన అభిప్రాయంగా చెప్పింది.
ఇంతలో అటుగా వచ్చిన ఏరుచ్ తల్లి గైమాయి ఈ మాటలు ఆలకించి, మన్సారీమాయికి అప్పగించిన పనిని తాను చేపడతానని చెప్పి, వాలూ తిరిగి కోలుకునే దాకా తగిన సపర్యలు చేసింది. ఆ తర్వాత మన్సారీమాయి తన తప్పును తెలుసుకుని బాబాను క్షమించమని వేడుకుంది.
బాబా మనలోని అహాన్ని తొలిగించి ప్రేమను ప్రోది చేస్తారు. బాబాకు అత్యంత సన్నిహితంగా వుండి బాబా ప్రేమను పొందే భాగ్యం మాకు లభించిందని మెహెర్‌నాథ్ అన్నారు. రెండ్రోజుల ప్రేమిక సహవాస్ రెండు క్షణాలుగా గడిచిపోయాయి.
శ్రీ రాజగోపాల్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసిందని జూన్ 14న ప్రకటించారు. అనంతరం రాజగోపాల్ ఇచ్చిన జ్ఞాపికలు తీసుకుని ఆ మధురక్షణాలు జ్ఞాపకం చేసుకుంటూ మా స్వగ్రామాలకు వెనుతిరిగాం.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

కాసేపటికి రావ్‌సాహెబ్ బాబావారి సమక్షానికి వచ్చారు.
వెంట ఓ కుర్రాడున్నాడు.
బాబావారిని దర్శించాలని అనుకుంటున్నాడట, అందుకని తీసుకొచ్చానన్నాడు.
ముక్కుపచ్చలారని ఆ కుర్రాడిని చూస్తే ముచ్చటగా వుంది.
పేరు పండిట్ మహమ్మద్ దుకాన్‌దార్.
పేరులోనే పండిట్ అని వుంది కాబట్టి వీడు ఎంత గొప్ప పండితుడో
అనుకోవద్దు పాఠకమహాశయా!
కాశ్మీరులో బ్రాహ్మణులను పండిట్‌లనే పిలుస్తారు.
ఇది ఉత్తరాది సాంప్రదాయం కూడా.
బహుశా కాశ్మీరులో పండిత ప్రకాండులు సర్వ సాధారణంగా బ్రాహ్మణులు కావడంతో,
బ్రాహ్మణ వర్గానికి పండిట్ ఓ కులం పేరుగా ఏర్పడి ఉండవచ్చు.
ఇది ఊహాగానం కొంత వరకు.
ఆ సంగతి అలా ఉంచితే మన కుర్ర పండిట్ బాబావారికి బాగా నచ్చాడు.
ఈ పసివాడు అమాయకుడు.
వీడి మనస్సు వెన్న. నిర్మలంగా, స్వచ్ఛంగా మెరిసిపోతోంది.
పిల్లవాడైనా జ్ఞాని అని మెచ్చుకున్నాడు బాబా.
అందుకనే కామోసు కోరిన వరం ఇవ్వాలనుకున్నాడు.
"ఏమి కావాలి నాయనా" అని బాబా అడిగారు.
ఆ పసివాడు నాకేమీ వద్దు బాబా అన్నాడు.
అదేమిటి? ఎందుకు వద్దంటావు,
నీ కోరిక నేను తీరుస్తాను అంటున్నానుగా అన్నారు బాబా.
ఆ పిల్లవాడు ఏమన్నాడో తెలుసా?
ఇప్పుడు ఏమీ వద్దు ప్రభూ!
మళ్ళీ వస్తాను ఇంకోసారి.

అప్పుడు విన్నవిస్తాను మనస్సులోని కోరిక అన్నాడు.
బాబావారికి ఆ పిల్లవాడి మాట నచ్చింది.
సరే, నీ ఇష్టం అన్నారు. "ఎంత సేపటిలో వస్తావు?
అరగంటలో వస్తావా? గంట సేపు పడుతుందా మళ్ళీ రావడానికి?
తప్పకుండా రావాలి సుమా!" అన్నారు.
బాబావారి మాట వింటూనే ఆ పిల్లాడు వెనక్కి వెళ్ళిపోయాడనుకుంటున్నారా?
అబ్బే! అలా చేయలేదు.
మరి ఏం చేశాడు?
ప్రభువు ముందు బుద్ధిగా కూర్చున్నాడు.
చూసేవాళ్ళు అనుకున్నారు ఈ పిల్లాడి మనస్సులో ఏదో కోరిక వుంది,
అందుకనే కదలకుండా బాబావారి దగ్గరే చతికిలబడ్డాడు అని
రావ్‌సాహెబ్ ప్రభృతులు అనుకున్నారు.
ఆ పిల్లవాడి దృష్టి బాబావారి పైనే ఉంది.
ప్రభువు మనస్సు మళ్ళీ కరిగింది.
మనస్సులో మాట చెప్పు నాయనా!
సందేహించకు అన్నారు.
కుర్రాడు తటపటాయించడం చూసి ఏమి కావాలి నాయనా నీకు?
చదువులో ముందుకు దూసుకుపోవాలనుకుంటున్నావా?
ఉద్యోగం కావాలా?
ఇవేమీ వద్దు!
ముక్తి కావాలి అంటావా?
నీ కోరిక తీరుస్తాను,
మనస్సు విప్పి అడుగు అన్నారు.
నాకు భక్తి కావాలి అన్నాడు ఠపీమని.
అ కుర్రాడి మాట వింటున్నవారు "హారి పిడుగా"! అనుకున్నారు.
బాబావారు ప్రసన్నులయ్యారు.
నీ కోరిక తీరుస్తాను అని అభయం పలికారు.
భక్తికి మించినది మరొకటి లేదన్నారు.
నీకా చింత వద్దు, నీకు భక్తిని ప్రసాదిస్తాను అన్నారు.
ఇహ మన కాశ్మీరీ పండితులవారు ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యారు.
కానీ పైకి తొణకలేదు.
బాబావారి పాదాలకి అంజలి ఘటించాడు.

మళ్ళీ వస్తాను ప్రభూ అంటూ ఇంటిదారి పట్టాడు.
రావ్‌సాహెబ్‌కు అదొక మధురానుభూతి.
ఏదో బాబావారి దర్శనం కోసం తపిస్తున్నాడని
ఆ కుర్రాడిని తీసుకువచ్చాడే తప్ప,
అతడాడు అంత గొప్ప కోరిక కోరతాడని కానీ,
బాబావారు అనుగ్రహిస్తారని కానీ రావ్‌సాహెబ్ ఊహించ లేదు.
అసలు అతని ఊహ అంత దూరం పోలేదు.
అందుకనే దుకాన్‌దార్ ఇష్టసిద్ధిలో
నా వంతు సాయం చేసానని పొంగిపోయాడు.

❋ ❋ ❋

బాబావారి మాటలు వింటుంటే ఆఘా ఆలీకి దు:ఖం ముంచుకువచ్చింది.
ఎంత పొరపాటు చేశాను అని కుమిలిపోయాడు.
బాబావారిని హత్తుకుపోవాలని ఎంతగానో అనిపించింది రాత్రి వాడికి.
కాని ఇప్పుడేమో బాబావారు తమని తాకడానికి కూడా వీలులేదని అంటున్నారు.
ఒకప్పుడు పిలవకుండానే పలికేవారు.
అడగకుండానే ముద్దులతో ముంచెత్తేవారు.
ఒడిలోకి తీసుకుని లాలించేవారు.
అప్పుడేమో.. ఏమిటీ తంతు అనిపించేది.
పెద్దగా ఆసక్తి చూపేవాడు కాదు.
మరి ఇప్పుడు ఏం చేయాలి దేవ దేవా అని మధనపడ్డాడు ఆఘా ఆలీ.
ఎప్పుడో కానీ దొరకని అవకాశం తలుపుతట్టి
పిలిచినప్పుడు పలకకపోతే అవకాశం జారిపోతుంది.
ఇదే జరిగింది ఆఘా అలీ విషయంలో.
ఈ మాటే బాబావారు సెలవిచ్చారు.
ఆ కుర్రాడి ఆంతర్యం ప్రభువుకి తెలుసు కాబట్టి
కాస్తంత ధైర్యం నూరిపోశారు.
నన్ను తాకితే ఏమి వస్తుంది నీకు కానీ ఇంకెవరికైనా కాని.
నేనీ శరీరాన్ని కాదు కదా అన్నారు.
నీకు కావల్సింది, నీలో ఉండాల్సింది భగవత్ ప్రేమ.
ఆ ప్రేమకి కళ్ళకి కనపడే దేహంతో పనిలేదు అన్నారు.
త్రికరణశుద్ధిగా ప్రేమ పొంగి పొర్లాలి నీలో అని చెప్పారు.
ఆ భావన, ఆ ప్రేమ మీలో ఉంటే చాలు.

స్పర్శానుభూతికి అవి సరితూగుతాయి అన్నారు.
ఇంకోమాట సెలవిచ్చారు.
ఇది పిల్లలు అందరి కోసం.
మండలివారు ఎవరికీ దొరకని అదృష్టం మీకిచ్చాను అన్నారు.
ఏమిటి ఆ అదృష్టం?
బాబావారికి దగ్గరగా వుండటం,
అదీ ఈ హర్వాన్ ఏకాంతవాసంలో.
ఎంత గొప్ప వరం.
అదే కదా పిల్లలకి దక్కింది.
ఈ మాటే అంటూ బాబావారు ఆ చిన్నారులకి ఓ చక్కని ఉపదేశం ఇచ్చారు.
ఇక్కడ తమ సమక్షంలో వాళ్ళకి ఎవరికీ దొరకని స్వేచ్ఛ ఉందన్నారు.
మీరు తీరుబాటుగా కూర్చోవచ్చు.
అటూ ఇటూ పచార్లు చేయవచ్చు అన్నారు.
అదీ ఇదీ కాదనుకుంటే,
నా కుటీరం దగ్గర ఓ గుహ కట్టుకోవచ్చు.
ఎందుకీ గుహ? భావి తరాలవారికి జ్ఞాపకం ఉండాలి కదా
మీరేం చేశారో నాకు దగ్గరగా ఉన్నప్పుడు అందుకని అన్నారు.
ఈ మాటల్లో బాబావారి అంతర్యం పాఠకులకు అర్థమయి ఉండాలి.
ఈ మాటలు అప్పటి పిల్ల గోపికలకు, మండలివారి కోసమే కాదు.
తరాలు మారినా అంతరాలు మారని భక్తకోటి కోసం కూడా.
ప్రభువు సన్నిధిలో ఏం చేస్తారో ఎలా చేస్తారో,
ఎలా ఉంటాలో ప్రభువు నిర్దేశించడు.
ఆ నిర్ణయాన్ని భక్తుడికి వదిలేస్తాడు.
ప్రభువు సమక్షంలో ఉన్నప్పుడు ఏంచేయాలి?
ప్రభువు నామాన్ని, ప్రభువు రూపాన్ని గుండె లోతుల్లో పదిలం చేసుకోవాలి.
అదొక అదృష్టం.
అరుదుగా లభించే మధురావకాశం.
ఆ సంగతి తెలీనివారేం చేస్తారు
ప్రభువు సన్నిధిలో ఓ రచ్చబండగా కూర్చుంటారు.
కాళ్ళు చాపుకు కూర్చుంటారు.
హమ్మయ్య! ఇక్కడ హాయిగా ఉందని పచార్లు చేస్తారు.
అదీ ఓ గొప్పగా భావిస్తారు.

నేను బోధించుటకు రాలేదు.
మేల్కొల్పుటకే వచ్చాను అన్న మెహెరుని ఉవాచ అక్షర సత్యమని పిల్లలకిచ్చిన
ఉపదేశం స్పష్టం చేస్తోంది.
మీకు ఏది కావాలో మీరే నిర్ణయించుకోండి.
ఆ స్వేచ్ఛ, ఆ స్వాతంత్ర్యం మీకు ఉన్నాయి అని
అంటూనే మేల్కొల్పు పాడారు బాబావారు.
ప్రపంచాన్ని వెన్నుతట్టి లేపారు.
ఆఘా ఆలీకి, అబ్దుల్లాకి కొత్త పని పెట్టారు.
ఆ పాటలు వినాలి అనిపిస్తే ఆలీని పిలుస్తాను.
వాడు వచ్చి గ్రామ ఫోన్ పెట్టి పాటలు వినిపించాలి అన్నారు.
ఇక్కడ ఈ కుటీరంలో నాకు అదే కాలక్షేపం అన్నారు.
అప్పటివరకు దిగాలుగా వున్న ఆఘా ఆలీకి హమ్మయ్య అనిపించింది.
నేను బాబావారికి దూరం కాలేదని సంతోషపడ్డాడు.
మనస్సు ఆనందంతో గెంతులు వేసింది.
ఇంతే కాదోయి నీకు ఇంకో వరం ప్రసాదిస్తున్నానన్నట్లు
బాబావారు ఇంకో పని పురమాయించారు.
రెండు రోజులగా అందరికీ తాము టీ పెడుతున్న సంగతి గుర్తుచేశారు.
నిన్న అయితే వంట అందరికీ చేసింది బాబావారే.
మరి ఇప్పుడు ఏకాంతవాసంలో బాబావారికి టీ ఎవరు చేస్తారు?
అసలు ఆపని ఎవరికి అప్పగిస్తారు బాబా.
అ అదృష్టవంతుడు ఎవరో.
నేనే కాదు కదా ఆ అదృష్టశాలి అని ఆఘా ఆలీకి అనిపించింది.
కాని పైకి అనలేదు.
ధైర్యం లేదని కాదు కాని
ఎందుకనో సాహసం చేయలేకపోయాడు.
బాబావారు అందరి మనస్సులు తెలిసిన జగదాధారుడు కదా!
అందుకనే ఆఘా ఆలీ నోరు విప్పి అడగకపోయినా
అతని కోరికని తీర్చారు.
టీ పెట్టమని అడుగుతాను నిన్ను అప్పుడప్పుడు అన్నారు.
ఆఘా ఆలీ గాలిలో తేలిపోయాడు.
ఇదంతా గమనిస్తున్న అబ్దుల్లాకి,
"మరి నాసంగతో", అనిపించడం సహజం.

మెహెర్ ప్రభువుకే అంకితమయిన చిన్నారి వాడు.
అందుకనే మండలివారికి కూడా దొరకని హర్వాన్ వరాన్ని అబ్దుల్లాకి ప్రసాదించడం.
ఏమిటీ ఆ వరం ఇంతకీ.
“నువ్వేమీ పనిచేయనక్కర్లేదు, నా దగ్గరే వుండు” అన్నారు.
టీ సమయంలో టీ కోసం, భోజన సమయంలో భోజనానికే బయటకి అడుగుపెడతాడు.
మిగిలిన సమయం అంతా నా దగ్గరే, నా పక్కనే ఉంటాడు అన్నారు.
అంటే బాబావారిని తాకే అదృష్టం అబ్దుల్లాకి దొరుకుతుందనుకుంటున్నారేమో పాఠకమహాశయా! అదేమీ లేదని బాబావారు తేల్చిచెప్పారు.
నువ్వు నాతో ఇక్కడ ఈ కుటీరంలో ఉంటావు.
ఇదొక్కటే నీ పని.
ఇంకో పని లేదు. నన్ను మాత్రం ముట్టుకోకూడదు.
దూరంగా కూర్చోవాలి” అని అబ్దుల్లాకి స్పష్టంగా చెప్పారు.
అయ్యో! ఇదేమిటీ, వాడేమి పాపం చేశాడు.
ఇలా చేశారు బాబా అని మండలివారికి అనిపించింది.
బాబావారి ఆంతర్యం వాళ్ళకేమి తెలుసు?
అబ్దుల్లాకి ఇచ్చిన పని వాడి మంచికోసమే నన్నారు బాబా.
వాడిని ఎవరూ తాకకండి. ఎవరూ నమస్కారం చేయకూడదు వాడికి అని హెచ్చరించారు.
తమ దైనందిన కార్యక్రమం వివరించారు.
రాత్రిపూట తమ విశ్వకార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.
పగలు చాలా వరకు విశ్రాంతి తీసుకుంటామన్నారు.
తమ దర్శనానికి ఎవరూ రాకూడదని స్పష్టంచేశారు.
దూరం నుంచి కూడా తమని చూడకూడదన్నారు.
తమ పని నిమిత్తం ఎవర్నయినా పిలుస్తామన్నారు.
అలా పిలిస్తే వచ్చినవాళ్ళు తమని తాకకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు.
తమని తాకకూడదని పదే పదే ఎందుకు హెచ్చరిస్తున్నదీ వివరించారు.
ఏదో ఆషామాషీగా ఈ ఆదేశాన్ని ఇవ్వలేదన్నారు.
ఇందుకూ ఓ కారణం వుందన్నారు.
అదేమీ మామూలు కారణం కాదన్నారు.
గొప్ప ప్రయోజనం కోసమే తమని తాకనివ్వటం లేదన్నారు.
భగవత్ప్రేమలో మిమ్మల్ని నిగ్గుచేర్చడమే తమ ఉద్దేశ్యమని చెప్పకనే చెప్పారు.
భగవత్ప్రేమికుడిగా మనిషి మారాలి.

ఇది అంత తేలిక కాదు అంటారు.
కానీ ఇంతకంటే ఇంకా కష్టమయినది ప్రియతముడు కాగలగడం.
అంటే భక్తి ముక్తి ప్రదాతలో లీనం కావటం.
ఇది చాలా కష్టమంటాను అన్నారు.
ఎందరో భగవత్ప్రేమలో పండిపోవచ్చు.
కానీ ప్రియతముడిగా, అంటే పరాత్పరుడి స్థితిని చాలా తక్కువ మంది మాత్రమే చేరుకోగలరు. తక్కువమంది అంటే చాలా కొద్దిమందికే దక్కుతుంది ఆ అదృష్టం.
పరమాత్మునిగా అసలు ఎవ్వరూ కాలేరన్నా అతిశయోక్తి కాదన్నారు.
అందుకు కారణం చెప్పారు. పరాత్పరునితో సాయుజ్యం ఆకాంక్షిస్తున్న వ్యక్తి తన సర్వస్వాన్నీ ప్రియతముని పాదపద్మాలకి సమర్పిస్తాడు.
తన దేహం, తన మనస్సు, తన ఆత్మ, తన అంతరాత్మ –
అన్నింటినీ అంకితం చేస్తాడు.
అలా చేస్తేనే ప్రియతముడి దర్శనం దొరుకుతుంది.
ప్రియతముడు – అదే పరమాత్మ అందరికీ దొరకడు అని
అంటూ సద్గురువు స్థితి గురించి వివరించారు.
సద్గురువు అన్నా – కుతుబ్ అన్నా ఒక్కటే.
ఆ భూమికలో సద్గురువు సర్వం తెలిసినవాడు.
అతను మామూలు మనిషా? కాదు.
ప్రేమ కురిపించే మామూలు ప్రియతముడా? కానే కాదు కదా!
మరి అంతటి సర్వోన్నతుడు తన ప్రేమికుడికి ఏ పనైనా పురమాయించవచ్చు.
ఎప్పుడైనా పని చెప్పవచ్చు.
గురువుగారి ఆదేశాలు అనుమానాలు, సందేహాలు రేకెత్తించవచ్చు భక్తునిలో.
మరి అలా జరిగితే శిష్యుడి భగవత్ప్రేమ ఫలించదు.
విఫలమవుతుంది. భగవంతుడుకి దూరం అవుతాడు.
భగవంతుడిని వదిలి పెట్టేస్తాడనవచ్చు అన్నారు.
ఈ సంగతి మరింత వైనంగా చెప్పాలనుకోన్నారేమో ఏమో మరి,
బాబావారు ఓ సద్గురువు కథ చెప్పారు.
గురువుగారి ప్రక్కకి శిష్యుడు పడుకొనేవాడు.
ఒకరోజు రాత్రి మెళుకువ వచ్చింది.
లేచి కూర్చున్నాడు.
గురువుగారు మంచి గాఢనిద్రలో వున్నారు.
అలసి సొలసి పడుకున్నారు స్వామి.

వారి నిద్రకి అంతరాయం కల్గించ కూడదనుకున్నాడు.
మరి తనకేమో నిద్ర రావడంలేదు.
అందుకని స్వామికి దగ్గరగా కూర్చున్నాడు.
ఆయనకేసే చూస్తున్నాడు.
ఇంతలో స్వామిలో చలనం కనిపించింది.
మెళుకువ వచ్చిందా గురువు గారికి అని అనుకుంటుంటే,
అతగాడు ఊహించలేని సంఘటన జరిగింది.
అది చూసి ముక్కున వేలు వేసుకున్నాడు.
ఏమయ్యింది గురువుగారని అనుకుంటుంటే, స్వామి లేచి,
నది ఒడ్డుకు వెళ్ళి స్నానం చేసి వచ్చి మళ్ళీ పడుకున్నారు.
అలా ఒకసారా, రెండుసార్లా మొత్తం 75 సార్లు జరిగింది.
గురువు గారు అన్నిసార్లు నదికి వెళ్ళి మునిగి వచ్చారు.
స్నానం చేసి వచ్చాక ఏమీ జరగనట్లే ఆదమరచి పడుకొనేవారు.
శిష్యుడికి బుర్ర తిరిగింది.
ఈ మహానుభావుడు సద్గురువుని అంటాడు.
మరి నిద్రలో స్కలనం చేస్తున్నాడేమిటి?
ఏదో నాబోటివాడు మేనక, రంభ వంటి అప్సరసలను ఊహించుకొంటూ
కలలు కనడం, నిద్రలోనే స్కలనం చేయడం తప్పు లేదు.
కానీ సద్గురువులు కూడా ఇలా చేస్తారా?
అయినా ఇంతకీ మన గురువు గారు దొంగ స్వామి కాదు కదా అన్న అనుమానం వచ్చింది. అనుమానం పెనుభూతంగా మారింది.
నిద్ర పట్టడం లేదు.
తొలి కోడి కూసేవరకు అలా గోడకి జార్లపడి కూర్చొన్నాడు.
తెల్లవారుతూనే గురువు గారు మంచం దిగారు.
కాలకృత్యాలు తీర్చుకొన్నారు.
తమ మండలివారి దగ్గరికి వెళ్ళారు.
గురువు గారి వెంట మన నిద్ర రాని శిష్యుడు కూడా కదిలాడు.
గురువు గారు మండలివారి మధ్య కూర్చోగానే,
తనూ ఓ ప్రక్కన చతికిలపడ్డాడు.
గురువు గారు ఆ విషయం, ఈ విషయం మట్లాడుతూ
రాత్రి తమకు 75 సార్లు స్కలనం అయిందన్నారు.
ఇది ఏదో యధాలాపంగా జరిగినట్లు మాట్లాడారు.

ఏమాత్రం సిగ్గు పడినట్లు కనపడలేదు.
ఇది మన మిత్రుడికి మరింత ఆశ్చర్యం కలిగించింది.
ఎవరూ పెదవి కదపలేదు.
బహుశా అందరూ సిగ్గు పడుతున్నారేమో అనుకొన్నాడు మన మిత్రుడు.
ఇంతలో ఇంకో శిష్యుడు తన మనస్సులో మాట చెప్పాడు.
మనసులో మాట అనేకంటే తన తెలివితేటలు ప్రదర్శించాడంటే సబబు.
ఇంతకీ అతగాడు ఏమన్నాడంటే..
మీరు సర్వజ్ఞులు.
మీకు అన్నింటితోను సంబంధం వుంది.
బహుశా ఇందువల్లనే మీకు రాత్రి అన్నిసార్లు స్కలనం జరిగి వుండవచ్చు అన్నాడు.
మీకు స్కలనం జరగడం ప్రకృతి సహజం.
మీరూ మా అందిరిలాగానే ఆహార, పానీయాదులు తీసుకుంటున్నారు.
అందర్నీ తాకుతున్నారు.
పులుపు, కారం తినే శరీరానికి కోరికలు పుట్టడం, స్కలనం జరగడం మామూలే కదా అన్నారు. ఈ మాట వింటుంటే మన మిత్రుడికి నిజమే కదూ!
ఇతగాడు అన్నదానిలో తప్పు ఏముందీ అనిపించింది.
సద్గురువు చిరునవ్వు నవ్వారు.
నీ మాట వినడానికి బాగుంది
కానీ ఏదో శారీరక కారణం వల్ల నాకు ఇంద్రియ స్కలనం జరగలేదు.
నా ఈ భౌతిక శరీరానికి అన్నింటితో సంబంధం
వున్నందువల్ల కూడా రాలేదు స్కలనం నాకు.
మరి ఎందుకు జరిగిందీ అంటే,
మీ కోసం జరిగింది అన్నారు.
"మా కోసమా?
మేము ఏం చేశాము.
ఈ విషయాలని ఎప్పుడూ గురువు గారి ముందు ప్రస్తావించలేదే"
అని మండలివారు అనుకొన్నారు.
"ఆ! అక్షరాలా మీ కోసమే అలా ఇంద్రియ స్కలనం జరిగింది గత రాత్రి!" అని మరోసారి సద్గురువు శెలవిచ్చారు.
మీరు నా దగ్గరివారు.
నా శిష్యులు.
అయినప్పటికీ నాపై పూర్తిగా భరోసా లేదు మీకు.

మీకు నాపై గురి వుంటే, అనుమానాలు వచ్చేవి కాదు.
గురి, నమ్మకం ఎలా వుండాలి?
రాయి అంత గట్టిగా వుండాలి.
ఆటుపోటులకి కదలకూడదు.
ఊగిసలాడకూడదు.
ఎన్నో ఏళ్ళుగా నా దగ్గర వుంటున్నారు.
నా సాన్నిధ్యంలో వుంటూ,
నన్ను నిత్యం సేవిస్తున్న మీకు నాపై నమ్మకం అంతగా లేదనిపించింది.
అందుకే రాత్రి పరీక్ష పెట్టాను అన్నారు.
సిగ్గులో తలదించుకున్నారు శిష్యగణం.
ఈ కథ బాబావారు ఎందుకు చెప్పారో మీరు ఊహించగలరు.
తమ మధ్య వున్న పరాత్పరుడిని తాకినా,
లేక తాకకపోయినా ఫరవాలేదు కానీ
పరాత్పరుడిపై అచంచలమైన నమ్మకం వుండాలి.
ఎట్టి పరిస్థితుల్లోను ఆ గురి చెదరకూడదు.
పరాత్పరుడిని ప్రేమించి, ఆరాధించి, తరించడం అందరికీ సాధ్యం కాదు.
భగవత్ప్రేమలో అపనమ్మకాలకి చోటు లేదు.
సందేహాలకి తావులేదు. అపనమ్మకం, నమ్మకం ఒక ఒరలో ఒదిగి వుండవు.
అపనమ్మకం వున్న చోట భక్తి వుండదు.
ప్రేమ పెల్లుబకదు.
భగవంతుడు అందరికీ ప్రియతముడు.
మరి ఆ భగవంతుడిని ప్రేమించి, తరించడం అందరి వల్ల కాదు.
ఎక్కడ పడితే అక్కడ దొరకదు భగవత్ప్రేమ.
భగవంతుడు తలచుకుంటే, చిటికెలో సందేహాలు సృష్టిస్తాడు తన భక్తుల్లో.
భగవంతుని ఇచ్ఛ వల్ల కూడా ఆ భక్తునిలో అనుమానలు పెనుభూతాలు కావచ్చు.
వాటి నుంచి తప్పించుకోవాలి.
అచంచలమైన భక్తి వుంటే సందేహాల సాగరాన్ని ఈదవచ్చు.
ఒక్కసారి అనుమానాలు, సందేహాలు పుడితే అక్కడ భగవత్ప్రేమ వుండదు.
గురువుపై అపనమ్మకం ఏర్పడ్డాక, గురువుని శిష్యుడు ఆరాధించ లేదు.
ప్రేమతో సేవించి తరించ లేదు అని
బాబావారు పేర్కొన్నారు.

**(సశేషం)**

# పెద్దన్నయ్య

-యస్. కృష్ణమూర్తి, విశాఖ



శ్రీ తిరుపతి శర్మ (88) విశాఖపట్నం 2014 జూన్ 13న బాబాలో ఐక్యమయ్యారు. మెహెర్‌బాబా ప్రేమికులందరికీ శ్రీ శర్మ సుపరిచితులు. వారి అసలు పేరు పోచిన పెద్ది సత్య సరస్వతి వెంకట రమణయ్య శర్మ. ఐతే, ఆయన ఒకసారి తన స్వగ్రామం నుండి తిరుమల-తిరుపతికి సైకిల్ త్రొక్కుకుంటూ వెళ్ళొచ్చాడు. అదిగో అప్పటినుండీ ఆయన్ని అందరూ ప్రేమగా మా తిరుపతి శర్మగా పిలవడం మొదలెట్టారు. నిత్యం బాబా నామస్మరణతో, బాబా సందేశాలను వల్లెవేస్తూ గడిపిన శ్రీ శర్మ ధన్యులు. ఎక్కడ బాబా కార్యక్రమం ఉందన్నా, ఎంతటి శ్రమకైనా ఓర్చి ఆయా కార్యక్రమాలలో ఆయన పాల్గొనేవాడని స్థానిక బాబా ప్రేమికులు ప్రేమతో చెబుతారు. అందరితో ప్రేమగా మాట్లాడే శర్మాజీని స్థానికులందరూ తమ పెద్దన్నయ్యగా భావిస్తారు. శ్రీ శర్మ ఒక ఆదర్శనీయమైన అవతార్ మెహెర్‌బాబా ప్రేమికునిగా బాబా ప్రేమికులందరి మదిలో చిరస్మరణీయంగా నిలుస్తారు.

శ్రీ శర్మ తన చిన్ననాటి యధార్థ సంఘటన నొకదాన్ని మాతో ఇలా చెప్పారు. మీరూ ఆలకించండి. అప్పటికి శర్మాజీకి సుమారు 13 సంవత్సరాల వయస్సు ఉంటుంది. వారిది తుని తాలూకాలోని కోట నందూరు గ్రామం.

ఒక చిన్న పల్లెటూరు. ఒకరోజున ఉదయాన్నే కాలకృత్యాలకై ఊరిబయటకు వెళ్ళాడు. అక్కడ పందులు గలాటా చేస్తున్నాయి. ఇది గమనించి, అదేదో తెలుసుకుందామని అటువైపుగా వెళ్ళి చూస్తే ఏముంది? రోజులు నిండని ఒక పసిబిడ్డ నేలపై పడివుంది.

ఆ బిడ్డ పుట్టి కొద్ది గంటలు మాత్రమే అయ్యుంటుంది. ఏ తల్లో పరిస్థితుల ప్రభావం వల్ల, పుత్రవాత్సల్యానికి తిలోదకాలిచ్చి నిర్దయగా ఊరిబయట పడవేసింది. ఆ పసిబిడ్డను చూడగానే శర్మ గారి హృదయం బాధా పరితప్తమైంది.

వెంటనే ఆ బిడ్డను చేతుల్లోకి తీసుకొని తనకు తెలిసినవారందరికీ చూపించాడు.
ప్రక్క గ్రామాల వారికీ తెలియజేశాడు.
ఆ బిడ్డను తీసుకోవడానికి ఎవ్వరూ ముందుకురాలేదు.
రెండు రోజులు ఆ పిల్లవానికి అన్నీ తానయ్యాడు.
అతి కష్టంమీద పాలు పట్టించాడు.
ఈ విషయం ఆయన తల్లితండ్రులలకు తెలిసింది. వారు కూడా తమ కొడుకు చేసిన పనిని హర్షించ లేదు. సరికదా ఇంట్లోకి రావద్దన్నారు.
దాంతో స్థానికంగా గల అనాధ ఆశ్రమంలో ఆ పిల్లవాడిని చేర్పించాడు.
వారు ఆ పిల్లవానికి **"భరత్"** అని పేరు పెట్టారు.
ఆ దరిమలా స్థానిక బ్రాహ్మణ కట్టుబాట్లు, సాంప్రదాయాలకు లోబడి శర్మాజీకి ప్రాయశ్చిత్తం చేశాక, తల్లితండ్రులు ఆయన్ని ఇంట్లోకి రానిచ్చారు.
ఆ దరిమలా-అవకాశం చిక్కినప్పుడల్లా అనాధ ఆశ్రమంలోని పిల్లవాడిని చూసి వచ్చాడు. ఆ పిల్లవాని పూర్వజన్మ సుకృతమో, భగవంతుని కృప వల్లనో చదువు బాగా ఒంటపట్టింది. ఎంత బాగా చదువుకున్నాడంటే, చిన్న వయస్సులోనే ఐ.ఎ.ఎస్. పరీక్ష ప్యాసయి, ఉన్నతోద్యోగిగా స్థిరపడ్డాడు.
భరత్ కూడా శర్మాజీని మరచి పోలేదని మాతో ఆయన చెప్పేవాడు.....
శర్మాజీ 80 వసంతాలలో చేసిన ఇలాంటి నిస్వార్ధ సేవా కార్యక్రమాలు ఎన్నో..ఎన్నో...
ఇదొక మచ్చు తునక మాత్రమే.
ఆయన ఒక ఆదర్శమైన బాబా ప్రేమికునిగా బాబా ప్రేమికులందరి హృదయాలలో నిలిచిపోతాడు.
బాబా సందేశాలపై ఆయన అనర్గళంగా ప్రసంగించేవాడు.
బాబా సాహిత్యాన్ని ఆసాంతం చదివాడాయన.
బాబా సందేశాలను, ప్రవచనాలపై ప్రసంగించడమే కాదు, వాటిని ఆచరణలో అమలుపరిచేందుకు కృషి చేసిన ధన్యుడు.
స్థానిక బాబా ప్రేమికులందరికీ చేదోడు వాదోడుగా పెద్దన్నయ్యగా వున్నాడు.
బాబా ప్రేమలో, సేవలో ఆయన తరించాడు.
సంపూర్ణంగా సేదతీరాడు.
బాబా సేవలో తరించిన శ్రీ శర్మాజీని స్మరించుకుంటూ విశాఖలో ఇటీవల ప్రత్యేక బాబా ప్రేమిక సహవాస్‌ను ఏర్పాటు చేసుకున్నాం.
నేటి యువతరం బాబా ప్రేమికులందరికీ శ్రీ శర్మాజీ ఆదర్శం కావాలి.

# బాలగోపాల భాస్కరరాజు - బుర్రకథ

- ఎన్.వి.వి. సత్యన్నారాయణ



ఇది 1959 మే మాసంలో జరిగిన సంఘటన.
ఆనాడు బాబా సమక్షంలో నేనూ ఉన్నాను.
ఈ సంఘటనకు నేను ప్రత్యక్ష సాక్షిని.
ఆనాటి విషయాలను చర్వితచరణంగా స్మరించుకుందాం!!
బాలగోపాల భాస్కరరాజు గారు పూణేలో బాబా ఎదుట బుర్ర కథ వినిపించిన సంఘటనకు సంబంధించిన పూర్వాపరాలను నాకు గుర్తున్నంత మేరకు మెహెర్‌బాబా సంచిక పాఠకులతో పాలుపంచుకునే ప్రయత్నం చేస్తున్నాను. దయచేసి పరిశీలించండి. భాస్కరరాజు గారు గొప్ప చిత్రకారుడు. ఈ సంచికపై వున్న ముఖ చిత్రం, భాస్కరరాజు గారి కుంచె నుండి జాలువారినదే. శ్రీ భాస్కరరాజు గారు గొప్ప కవి, కళాకారుడే కాదు, మెహెర్‌బాబా చేత తన వాడు అనిపించుకున్న అదృష్టవంతుడు. శ్రీ భాస్కరరాజు తనదంటూ ఒక ప్రత్యేక బుర్రకథ బృందాన్ని ఏర్పాటుచేసి అవతార్ మెహెర్‌బాబా జీవిత చరిత్రపై తెలుగునాట గల అనేక గ్రామాలలో బాబా నామవ్యాప్తికి విశేష కృషిచేశారు. ఈ బుర్రకథ కూడా అవతారుని ఆదేశాల మేరకే రూపొందిందని నా అభిప్రాయం. భాస్కరరాజు గారి అన్న గారు బాలగోపాల రామభద్రరాజు. ఆయనకి బాబా ఒకరోజున కలలో కనిపించి, నా కార్యక్రమాలు ఇంకా బాగా ఎలా చేయగలవ్? అని అడిగారట. అప్పటికే (1955) రామభద్రరాజు బాబాపై అనేక భక్తి గీతాలు రాశారు. **'మెహెర్ గీతావళి'** పేరిట భజన గీతాల పుస్తకాన్ని నొకదాన్ని ప్రచురించారు. ఇంకా ఏమి చేయగలమబ్బా అనుకుంటుండగా ఒకరోజున శ్రీ యం. యస్. ఆర్. శాస్త్రి, మచిలీపటట్నం బాబా జీవిత చరిత్రను బుర్రకథగా మీరు రాస్తే బాగుంటుందని రామబద్రరాజు గారికి సూచించారు. దాంతో బాబా తన కలలో బాబా కనిపించి చెప్పింది ఇదేనని భావించి, బుర్రకథని రూపొందించినట్లు బాలగోపాల రామబద్రరాజు చెప్పేవారు. తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కూడా భాస్కరరాజు బృందం బుర్రకథ ప్రదర్శన ఇచ్చారు.

సాక్షాత్తూ ఈ యుగావతారుడైన మెహెర్‌బాబా ఎదుట వరుసగా మూడుసార్లు

1. 1955 నవంబరు 14న, మెహెరాబాద్‌లో
2. 1958 ఫిబ్రవరి 25,బాబా జన్మదినోత్సవం నాడు మెహెరాబాద్‌లో
3. 1959 మే 18 గురుప్రసాద్, పూణేలో భాస్కరరాజు బృందం బుర్రకథ గానం చేసింది.

## గోఖలే హాలు

పూణేలో తెలుగువారు చాలామంది వున్నారు.
వారందరి కోసం ప్రత్యేకంగా 1959 మే 17న బాబావారి అనుమతితో
స్థానిక గోఖలే హాలులో భాస్కరరాజు బృందం బుర్రకథ ఏర్పాటు చేశారు.
ఈ కార్యక్రమం గురించే నేను వివరంగా చెప్పదలిచాను.
పూణేలో గోఖలే హాలంటే హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లాంటిది.
బుర్రకథ కార్యక్రమం ఏర్పాటుకు ముందుగా తెలుగువారందరికీ తెలియజేశేలా
బాబావారి ఆదేశాలతో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.
ప్రధాన వీధుల్లో పోస్టర్లు అంటించారు. దగ్గర్లో వున్న తెలుగువారందరి ఇళ్ళకు వెళ్ళి,
మహిళల్ని కుంకుమ బొట్టుపెట్టి సాంప్రదాయకంగా కార్యక్రమానికి ఆహ్వానించారు.
భాస్కరరాజు బృందం పూణేకు ఏ రైల్లో ఎప్పుడు వస్తున్నారు, వాళ్ళకి రైల్వే స్టేషన్‌లో
ఎవరు స్వాగతం పలుకుతున్నారు, వారికి భోజన, బస ఎక్కడ ఏర్పాటు చేశారు వంటి
అతి సాధారణ విషయాలను కూడా బాబా మండలివారిని ఎప్పటికప్పుడు అడిగి
తెలుసుకున్నారు. ... భాస్కరరాజు బృందం పూణేలో వారికిచ్చిన హెూటలు గదిలో
దిగాక, ఆయన్ని వచ్చి తనని కలవమని బాబా మధుసూధన్‌తో కబురు పంపారు.
ఐతే, ఆ సమయంలో వీరందరూ హెూటలు గదికి తాళం వేసి బయటకు వెళ్ళారు.
వారు తిరిగి గదికి వచ్చిన వెంటనే గురుప్రసాద్‌లో బాబాను దర్శించుకోవల్సిందని
చెప్పి చిన్న కాగితంపై రాసి, దాన్ని గది తలుపు గొళ్ళెంలో పెట్టి మధుసూధన్
వెనుతిరిగాడు. ఆ దరిమలా గదికి తిరిగి వచ్చిన బుర్రకథ దళం హుటాహుటిన
బాబా ఎదుట హాజరయ్యారు. బాబావారి ఆలింగన భాగ్యం పొందారు.
ఆ పిదప బాబా వారితో మాట్లాడుతూ, బుర్రకథ ఎంతసేపు
చెప్తారని అడిగారు. సుమారు 4 గంటలు చెప్తామన్నారు.
నాలుగు గంటలే!! అని ఆశ్చర్యంతో బాబా, నాలుగు గంటలు ఏకబిగిన కథ చెబితే,
బుర్రకథ బోరు కొట్టేస్తుంది. ఆధ్యాత్మికం కూడా విసుగుపుట్టిస్తుందని
బాబా చమత్కరించారు. అంతేకాదు బాబా ఇంకా ఏమన్నారో పరిశీలించండి.
మీరు ఆంధ్రా నుండి వచ్చారు. అక్కడికి ఇక్కడికి వాతావరణంలో చాలా తేడా వుంది.
మీరు ఎక్కువగా వరి అన్నం తినడానికి ఇష్టపడతారు.
దానివల్ల మగతలాంటి నిద్ర వచ్చే అవకాశం ఎక్కువ.
అందుకని ఈ పూటకి గోధుమ పూరీలు లేదా చపాతీలు తినండి.
వరి అన్నం తగ్గించండని హితవు చెప్పారు.
1959 మే 17తేదీన సాయంత్రం ఆరు తర్వాత గోఖలే హాలులో బుర్రకథ ప్రారంభమైంది.



ఆడిటోరియం స్థానిక తెలుగువారితో కిటకిటలాడింది. కార్యక్రమం ఎలా జరుగుతోందో చూసి రమ్మనమని బాబా ప్రేమికుడైన డాక్టర్ భరూచాను ప్రత్యేకంగా పంపారు. ఆ మర్నాడు గురుప్రసాద్‌కి వెళ్ళిన భాస్కరరాజు గారిని, ఇతర సభ్యులందరినీ చక్కని ప్రదర్శన ఇచ్చినందుకు బాబా ప్రత్యేకంగా అభినందించారు. వారితో మాట్లాడుతూ...ఇక్కడ ఫ్యాన్లు లేవు. ఐనా నా ఎదుట కథ చెప్పగలరా? అని భాస్కరరాజుని బాబా అడిగారు.

**మహా భాగ్యం** అన్నారు భాస్కరరాజు గారు.
క్షణకాలంలో మండలివారు అన్ని ఏర్పాట్లు చేశారు. బుర్రకథ మొదలయ్యింది.
అవతారుని జీవిత ఘట్ట వివరణలో కథకులు లీనమయ్యారు.
బాబాజాన్ బాబా భృకిటిన ముద్దాడిన ప్రాంతంలో ఉపాసనీమహారాజ్
చిన్న రాయితో కొట్టినట్లు కథకులు వర్ణిస్తున్నారు.
ఈ సమయంలో బాబా కథకుల్ని ఒక్క క్షణం ఆగమన్నారు.
ఉపాసనీ తనని చిన్న రాయితో కాదు సుమీ...
ఇదిగో ఇంత పెద్ద సైజు రాయితో తన భృకిటిపై కొట్టాడని చూపించారు.
మీరు కథ చెబుతుంటే పంచ సద్గురువులు ఇక్కడే వుండి చక్కగా ఆలకించారని
బాబా అన్నారు. భాస్కరరాజు బృందం బాబా ఎదుట బుర్రకథను హిందీలో చెప్పారు.
అందుకు తగిన విధంగా ముందుగా కథను హిందీలో తయ్యారు చేసుకున్నారు.
ఈ కార్యక్రమమం ఉదయం 10 గంటల సమయంలో జరిగింది.
ఆ దరిమలా అందరూ సంతోషంతో, తృప్తిగా తమ బసకి తిరిగి వెళ్తుంటే,
మండలి సభ్యుడైన ఏరుచ్‌తో బాబా కబురు పంపారు.
ఏమా కబురనుకుంటున్నారా?
మీకు ఇష్టమైతే, మీతో బాబా ఫోటో తీసుకోవాలనుకుంటున్నారు అని బాబా ఏరుచ్‌తో
కబురు పంపారు !! మహా భాగ్యం కదండీ.
"మీరు నాతో తీసుకున్న ఈ చిత్రాన్ని భవిష్యత్తులో చూసినవాళ్ళు,
మిమ్ముల్మి వేనోళ్ళ అభినందిస్తారని, సుమారు అర్ధ శతాబ్దం క్రితమే బాబా చెప్పారు.
అదే నిజమైంది. భాస్కరరాజు బృందం ధన్యులు".

బుర్రకథ దళంలో భాస్కరరాజు గారితోపాటు పారేపల్లి సత్యం, వెంకటాచార్యులు ఉన్నారు. అలాగే, శ్రీ అప్పాయలింగం, తబలా, శ్రీ సత్యనారాయణ రాజు, హార్మోణియంపై వాయిద్య సహకారం అందించేవారు. నేడు ఈ బృందంలో చాలా మంది బాబాలో ఐక్యమయ్యారు.
వీరు ప్రాపంచికంగా నిరుపేదలు.
కానీ, నా ప్రేమలో వీరు ఉన్నతోన్నతులు. ధన్యులు అని
మెహెర్‌బాబా స్వయంగా వీరిని ఆనాడే అభినందించారు!!

❊ ❊ ❊

## అవతారుని ఆతిధ్యం

బాబా తన ప్రేమికులను తనదగ్గరకు ఎప్పుడైనా ఆహ్వానిస్తే, వారి కనీస సౌకర్యాలు ఏర్పాటులో అతి చిన్న విషయాలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారు. ఒక సందర్భంలో మెహెరాబాద్‌కు ఒక విదేశీ ప్రేమికుడు వచ్చాడు. అతనికి ఎగువ మెహెరాబాద్‌లో చిన్న గదిలో బస ఏర్పాటు చేశారు. అతగాడు ఆరడులు పైన ఎత్తున్నాడు. ఆ గది ప్రధాన ద్వారం కొద్దిగా చిన్నదిగా ఉంది. ఇది తెలిసి, బాబా ఆతని తలకి దెబ్బ తగులుతుందేమో!! కాబట్టి సింహద్వారానికి పైన మెత్తని దిండ్లు పెట్టించండని బాబా తన మండలిని ఆదేశించారు.
1955 మెహెరాబాద్ సహవాస్‌కు విచ్చేసిన తన ప్రేమికులకు అవతారుడు చేసిన ఆతిధ్య ఏర్పాట్లు గురించి ఈ తరం తప్పక తెలుసుకోవాలి.

❊ ❊ ❊

మేం కొంతమందిమి 1955 సహవాస్‌కు మెహెరాబాద్‌కు వెళ్ళాం.
మెహెరాబాద్‌లో మాకిచ్చిన వసతి ప్రాంగణానికి ఒంటి గంట తర్వాతనే అనుమతిస్తామని మండలివారు ముందుగా పంపిన లేఖలో చెప్పారు. కాబట్టి, మేం నగర్ రైల్వే స్టేషను బయట ఎండలో తిరుగుతున్నాం. ఇది తెలుసుకున్న బాబా, ఇదేనా నా ప్రేమికులకు మీరిచ్చే మర్యాద అని బాబా తన మండలివారిపై కోపద్దారు. ఎండలో తిరగకండి. కనీసం నెత్తిపై టోపీ, రుమాలైనా పెట్టుకోండన్నారు. సూర్య కిరణాలు నేరుగా నెత్తిని తాకకుండా జాగ్రత్త తీసుకోమని బాబా కబురు పంపారు.

❊ ❊ ❊

బాబా పరిధిలోకి రావడం మన పూర్వజన్మ సుకృతం.
ఆయన స్వయంగా మనల్ని ఎంపిక చేసుకుని తన దరి చేర్చుకున్నాడు.
మనంతట మనంగా ఆయన పరిధిలోకి రాగల అర్హత మనకే మాత్రం ఉందో?
**సందేహమే సుమీ !!** ❊

# అవిధేయత

ఇది శ్రీ ఎన్.వి. రమణయ్య, గుంటూరుకు సంబంధించిన
యధార్థ సంఘటన. శ్రీ రమణయ్యకు మెహెర్‌బాబా పట్ల ఎంతటి ఆరాధన
ఉండేదో బాబా ప్రేమికులందరికీ తెలుసు. ఒక్కమాటలో చెప్పాలంటే,
ఆయన రాముల వారి దగ్గర హనుమంతుడులాంటివాడు.
రమణయ్య వ్యక్తిగతంగా ఎంతో మంచివాడు. అంతకుమించి మొండివాడు.
తాపట్టిన కుందేటికి రెండు కాళ్ళేనంటాడు.
ఇంతకీ ఏమంటే, – అది ఏ సంవత్సరమో గుర్తులేదు.
ఒకసారి మెహెర్‌బాబా గురుప్రసాద్, పూణేలో ఉన్నారు.
అది బాబా ఏకాంతవాస సమయం.
మండలి సభ్యుల్ని కూడా బాబా దర్శనార్థం అనుమతించని సమయమది.
ఆ సమయంలో ఫిబ్రవరి 25న బాబా జన్మదినం కావడంతో
శ్రీ రమణయ్య ఒక రోజు ముందుగానే పూణే చేరుకున్నాడు.
తెల్లవారితే బాబా జన్మదినం. మెహెర్‌బాబా కోసం నిలువెత్తు గులాబీ దండ
ఒకటి కొనుగోలు చేసి, పొద్దుబోయాక గురుప్రసాద్ దగ్గరకి వెళ్ళి ఏరుచ్‌ని కలిశాడు.
రమణయ్యను చూస్తూనే ఏరుచ్ అవాక్కయ్యాడు. ఏమిటిలా వచ్చావ్?
బాబా ఏకాంతవాసంలో ఉన్నారన్న సంగతి తెలియదా?
అని ఏరుచ్ కొంచెం కోపంగానే ప్రశ్నించాడు.బాబా ఎవరినీ అనుమతించరని
తెలుసు కదా? అని తిరిగి, ఏరుచ్ రమణయ్యతో అన్నాడు.
రమణయ్య ఏమాత్రం కంగారు పడలేదు.
“నేను బాబా దర్శనం కోరడం లేదన్నాడు.
బాబా ఏకాంతవాసంలో ఉన్నారన్న సంగతి తెలుసన్నాడు.
రేపు ఆయన పుట్టినరోజు. కాబట్టి, మీలో ఎవరో ఒకరు తెల్లవారుఝామున
బాబాకు బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పడానికి వెళతారు కదా!
అలా వెళ్ళినవారు, ఎవరైతే వెళతారో,
వాళ్ళు ఈ పూలమాల ఆయన మెడలో వేస్తే చాలు.
ఆ సమయంలో, ఎవరైతే బాబా దగ్గరకు వెళ్ళారో
వాళ్ళ చేతికి ఈ పూలదండ ఇవ్వండి.
అంతేకానీ నాకు బాబాను దర్శించాలనే కోరిక లేదు.
ఈ పూలదండను నేను తీసుకువచ్చానన్న సంగతి కూడా చెప్పొద్దు అని

ఎంతో వినమ్రంగా ఏరుచ్‌తో రమణయ్య చెప్పాడు.
ఇది ఉభయులకూ బాగానే ఉందనుకున్నారు.
అంతటితో రమణయ్య ఏరుచ్ దగ్గర సెలవు తీసుకున్నాడు.

*****

బాబా జన్మదినం రోజున తెల్లవారుఝామున ఐదు గంటలకు మెహెరాయాయి
బాబా మెడలో ఈ పూలదండ వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసింది.
దాంతో బాబా పూలదండను చూపిస్తూ, చాలా బాగుంది?
ఎక్కడ్నుంచి తెప్పించారని ప్రశ్నించారు. మెహెరామాయికి ఈ విషయాలన్నీ ఏం తెలుసు!
ఏరుచ్‌ని అడిగితే – ఫలానా – గుంటూరు రమణయ్య తెచ్చిన వైనం తెలిపాడు.
బాబా అతడ్ని పిలిపించండని ఆదేశించారు.
అయితే, అతను రాత్రి పూలదండ ఇచ్చి వెళ్ళిపోయాడన్నారు.
అతను ఎక్కడున్నా వెతికి పట్టుకోమన్నారు బాబా.
ఏరుచ్‌కి ఇదొక పెద్ద సమస్యగా మారింది.
ఆ మహానగరంలో ఎక్కడని వెతికి పట్టుకోవాలా? అని ఏరుచ్ అనుకుంటూ
గురుప్రసాద్ భవనం బయటకొచ్చి చూసేసరికి రమణయ్య వచ్చిన కార్లో
అలా కూర్చునే ఉన్నాడు. రాత్రి నిద్ర కూడా పోలేదు. రమణయ్యను బాబా పిలుస్తున్నారని
చెప్పాడు. బాబా రమణయ్యను చూస్తూనే సంతోషంతో
'పూలదండ బాగుంది' అని ఏరుచ్ ఎదుటనే అన్నారు. అంతేకాదు,
నీవు తెచ్చిన ఈ పూలదండ, నా మెడలోనించి తీసి, తిరిగి నీ చేతులతోనే
వేయమని తన సంజ్ఞలతో బాబా చెప్పారు. రమణయ్య ఆనందానికి అవధులు లేవు.
అవతారుడి మెడలో గులాబీ పూలమాల వేసి, ఆయన ఆలింగనం అందుకున్నాడు.
ఇదంతా ఏరుచ్ సమక్షంలోనే జరిగింది. "రమణయ్య – నాకేసి క్రీగంట చూస్తూ,
తానే విజయం సాధించినట్లు ఫోజిచ్చారని" ఆ తర్వాత బాబా ప్రేమికులతో మాట్లాడుతూ
ఏరుచ్ చమత్కరించారు.
ఇంతకీ బాబా ఏకాంతవాసంలో ఉన్నారని
తెలిసి ఎలా వెళ్ళారయ్యా?రమణయ్యా? ఇది బాబా ఆదేశాలపట్ల
అవిధేయత (Disobedience) కాదా? అని బాబా ప్రేమికులు ప్రశ్నిస్తే –
నవ్వుతూ 'తండ్రికి – పిల్లవాడికి మధ్య **అవిధేయత – విధేయత** ఏమిటి?'
అని కొట్టిపారేశాడు. మెహెర్‌బాబా పట్ల రమణయ్యకున్నది
స్వచ్ఛమైన, గాఢమైన ప్రేమ!! అదేదో మెహెర్‌బాబా – రమణయ్యలకే బాగా తెలుసు.
మెహెర్‌బాబాలో భగవంతుడ్ని చూసి తరించిన రమణయ్య ధన్యుడు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్, ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

**ప్రియ దైవమా!**

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

**2012 జూన్ – జులై నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1 | జులై | జి.ఎన్. సుబ్రహ్మణ్యస్వామి, విశాఖ | రూ. 500/- |
| 2 | జులై | ఎన్. సత్తయ్య, అదిలాబాద్ | రూ. 1000/- |
| 3 | జులై | తోట రాజన్న, అదిలాబాద్ | రూ. 1000/- |
| 4. | జులై | ఎ. రాజేశ్వరి, అదిలాబాద్ | రూ. 1000/- |
| 5. | జులై | పి. సుబ్బరామయ్య, కారప, తూ.గో | రూ. 500/- |
| 6. | జులై | ఆర్.ఎన్.మూర్తి, మండపేట, తూ.గో | రూ. 500/- |
| 7. | జులై | వై.సి.ఎస్. ఆనంద్, హైదరాబాద్ | రూ. 1000/- |
| 8. | జులై | మేధా దేశ్‌ముఖ్, బాచుపల్లి, హైదరాబాద్ | రూ. 1000/- |
| 9. | జులై | మంత్రి అప్పారావు, తుమ్మపాల, విశాఖ | రూ. 1000/- |
| 10. | జులై | వై. శ్రీ నగేష్, కాకినాడ | రూ. 1000/- |
| 11. | జులై | మధుసూదనాచారి, జంగారెడ్డి గూడెం, ప.గో | రూ. 1000/- |
| 12. | జులై | సి.ఆర్. ప్రసాదరావు, ముంబాయి | రూ. 1000/- |
| 13. | జులై | నారాయణరావు, రాజమండ్రి | రూ. 500/- |
| | | **మొత్తం** | **రూ. 11,000/-** |

❋ శ్రీ భావనారాయణ, హైదరాబాద్ వారు గత నెల జూన్‌లో జీవిత సభ్యత్వం కొరకు రూ. 1000/- చెల్లించినారు. వారి పేరు ముద్రించలేదు.

## పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు). ఆన్‌లైన్‌లో పంపగోరువారు. శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్. **SB A/C NO: 173201000027973.**
**IFSC CODE: IOBA 0001732.**

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087. ఫోన్:99595-53218,**
**email: malladisukku@gmail.com,**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**
RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month